వాస్తవాలు పలుకు DD9 వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 139 | 30-09-2026 | బుధవారం | పేజీలు: 10 | వెల: 3/-



కవిత ప్రశ్నలకే సమాధానాలు లేవు

- హరీశ్ రావును గుంటనక్క అని కవితే అన్నారన్న అద్దంకి
- కేసీఆర్ కుమారుడు కావడమే కేటీఆర్ ఏకైక అర్హత అని విమర్శ
- బీఆర్ఎస్ హయాంలో ఉద్యమకారులపై కేసులు పెట్టారని ఆరోపణ



కేటీఆర్‌కు సిరిసిల్లలో సినిమా చూపిస్తాం

- రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ భూ బాగోతాలు బయటపెడతారన్న చామల
- సీఎంను సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని చామల విమర్శ
- ప్రధాన ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ

దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



నిమ్స్ అధికారిపై ఏసీబీ సోదాలు..



- బినామీల ఇళ్లలో ఏసీబీ సోదాలు
- రూ.4.94 లక్షల నగదు స్వాధీనం
- రూ.2.70 కోట్ల ప్లాట్ పత్రాలు గుర్తింపు
- పెట్టుబడులు, భూముల డాక్యుమెంట్లపై దర్యాప్తు



ఓట్ చోరీపై దూకుడుగా వెళ్దాం

కాంగ్రెస్ కార్యకర్తలు యాక్టివ్ అవ్వాలి

- రెండేళ్లుగా ఓట్ల చోరీ అంశాన్ని ప్రస్తావిస్తున్నానన్న రాహుల్
- తొలుత పార్టీ నేతల్లో కొందరు తన వాదనను అంగీకరించలేదని వ్యాఖ్య
- ఇప్పుడు అందరూ అంశాన్ని అర్థం చేసుకున్నారని వెల్లడి
- ఎన్నికల ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచన
- ఈవీఎంలపై ప్రశ్నలను బలంగా ప్రస్తావించాలని సూచన
- సీడబ్ల్యూసీ సమావేశంలో ఎన్నికల వ్యవస్థపై చర్చ
- ఢిల్లీ బేలా ఎస్టేట్‌లో ఓటర్ల పేర్ల తొలగింపును ప్రస్తావించిన రాహుల్



నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..

- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు

హైదరాబాద్, (డీడీ9 వార్త):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పు బడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, మిగతా 2 లో..

నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్

- రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభ
- నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారతకు పెద్దపీట
- విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం పర్యటన
- నేతన్నలకు 'నేతన్న బజార్'..
- మహిళా శక్తి భవనానికి శ్రీకారం
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.99.40 కోట్లతో పనులు
- కొత్త ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన



హైదరాబాద్, (డీడీ9 వార్త):

ముఖ్యమంత్రి హోదాలో ఎన్. రేవంత్ రెడ్డి తొలిసారిగా ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా మూడుసార్లు సిరిసిల్ల గడ్డపై అడుగు పెట్టిన ఆయన, ఇప్పుడు ముఖ్యమంత్రిగా జిల్లా సమగ్ర రూపురేఖలను మార్చేలా రూ. 345.78 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సిరిసిల్ల రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. స్థానిక నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారత, విద్యా రంగం , మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం మిగతా 2 లో..

మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి

- ఓట్ల ట్యాంపరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్
- రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి తొలగించాలని డిమాండ్
- సోనియా గాంధీ ఓటుపై రాహుల్ సమాధానం చెప్పాలన్న అరవింద్

హైదరాబాద్, (డీడీ9 వార్త):

ఓట్ల ట్యాంపరింగ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ఓట్లను ట్యాంపరింగ్ చేసి ఉంటే లోక్‌సభలో 400 సీట్లు గెలిచేవాళ్లమని, కేవలం 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటామని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని, భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన నవ్వులపాలు చేస్తున్నారని మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈవీఎంలను రాజీవ్ గాంధీ హయాంలోనే ప్రవేశపెట్టారని, వీవీప్యాట్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈటల గుర్తుచేశారు. ఇదే అంశంపై ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఉన్నంతవరకు 'కాంగ్రెస్ ముక్త్ భారత్' సాధ్యమేనని ఎద్దేవా చేశారు. "పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని" ఆయన డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో గెలవలేకే మిగతా 2లో..



సీఎం సొంత నియోజకవర్గంలో కూల్చివేతలా?

- మద్దూరులో పేదల ఇళ్ల కూల్చివేతపై హరీశ్‌రావు ఆగ్రహం
- రాత్రికి రాత్రే ఇళ్లపై బుల్డోజర్లు ప్రయోగించారంటూ ఆరోపణ
- సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసిన బీఆర్ఎస్ నేత
- నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారని ఆరోపణ
- న్యాయస్థానాల తీర్పులను సైతం పట్టించుకోవడం లేదని విమర్శ
- పోలీసులను అడ్డుపెట్టుకుని బుల్డోజర్ రాజ్ నడుపుతున్నారని ఆరోపణ
- నిరుపేదలను అర్ధరాత్రి రోడ్డున పడేయడం కర్కశమని వ్యాఖ్య
- బాధితులకు ప్రభుత్వం తక్షణమే బాధ్యత వహించాలని డిమాండ్



హైదరాబాద్, (డీడీ9 వార్త):

మద్దూరులో పేదల ఇళ్లను రాత్రికి రాత్రే బుల్డోజర్లతో కూల్చివేశారంటూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. 'కొడంగల్ బిడ్డను' అని చెప్పుకొనే ముఖ్యమంత్రి.. సొంత నియోజకవర్గ మిగతా 2లో..

గుంతల గుప్పిట్లో ఏజెన్సీ రహదారులు.. అధికారుల నిర్లక్ష్యానికి అంతెప్పుడు?



10

- మూడేళ్లుగా గుంతల నరకయాతన.. నిధులు మంజూరైనా కదలని పనులు!
- ఇసుక లారీలకు దారులున్నాయి.. ప్రజలకు గుంతలే గతి!
- హామీలతో కాలయాపన.. ప్రమాదాల అంచున ఏజెన్సీ ప్రజల ప్రయాణం!
- వెంకటాపురం–భద్రాచలం రహదారి దుస్థితిపై ప్రజాగ్రహం.. శాశ్వత పరిష్కారం కోసం డిమాండ్..

నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

ఈ భారీ నిధులను కేటాయించింది.

నేతన్నలకు 'నేతన్న బజార్' కొండంత అండ..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, చేనేతపవర్‌లూమ్ కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. సిరిసిల్ల సాంచాలపై ఉత్పత్తి చేసే పెట్టికోట్, పాలియెస్టర్ వస్త్రాల మార్కెటింగ్‌కు వీలుగా కొత్తగా 'నేతన్న బజార్'ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. చేనేత, పవర్‌లూమ్ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. దీనితో పాటు మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో మోడల్‌గా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, జీవనోపాధి శిక్షణలతో పాటు వారు ఉత్పత్తి చేసే వస్తువుల విక్రయాలకు ఈ భవనం ప్రధాన కేంద్రంగా నిలవనుంది.

రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రూ. 200 కోట్ల వ్యయంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను' నిర్మించనున్నారు. పెద్దూరులో 18 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఈ విద్యా సముదాయంలో 5 నుంచి 12వ తరగతి వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు వసతి, విద్య అందించేలా 64 తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్ బ్లాక్, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయనున్నారు. దీనికితోడు సిరిసిల్ల, కోనరావుపేటలలో ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయి వసతులు, సైన్స్ ల్యాబ్‌లు, ఐటీ మౌలిక వసతులతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నిర్మాణాలకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

రాజన్న ఆలయాభివృద్ధికి ₹99.40 కోట్లు..

కొత్త ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రూ. 99.40 కోట్లతో చేపట్టే 26 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో ప్రాకారాలు, గోపురాలు, మండపాల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుదీకరణ, షాపింగ్ కాంప్లెక్సులు ఉన్నాయి. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా సిరిసిల్ల, వేములవాడల్లో రెండు కొత్త ఆర్‌డీఓ కార్యాలయాలు, నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు (తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగి), సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించనున్నారు. రక్షణ రంగంలో భాగంగా వేములవాడలో కొత్తగా మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ సిరిసిల్ల పట్టణాల్లో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది.

కేటీఆర్‌కు సిరిసిల్లలో
సినిమా చూపిస్తాం

- **రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ భూ బాగోతాలు బయటపెడతారన్న చామల**
- **సీఎంను సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని చామల విమర్శ**
- **ప్రధాన ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ**



హైదరాబాద్, (డీడీ9వార్త):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేపు సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూపిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని హెచ్చరించారు. గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ సవాల్ చేయడంపై చామల తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. సిరిసిల్ల ప్రజల ముందే కేటీఆర్ భూ బాగోతాలను రేవంత్ బయటపెడతారని, ఆయన అసలు స్వరూపం దేశమంతటికీ తెలుస్తుందని అన్నారు.

గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లలో నిజమైన అభివృద్ధి జరగలేదని, కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యారని ఆరోపించారు. చిన్న వర్షానికే కలెక్టరేట్ భవనంలోకి వెళ్లలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో రూ.175 కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిందని, సీఎం పర్యటనలో రూ.345.75 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, నేతన్నల కోసం ప్రత్యేక బజార్ వంటి పనులను వివరించారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

మేం ట్యాంపరింగ్ చేస్తే
400 సీట్లు వచ్చేవి

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ లేనిపోని సమస్యలను సృష్టిస్తోందని అర్వింద్ ఆరోపించారు. దేశాన్ని, హిందువులను కించపరచడమే లక్ష్యంగా రాహుల్ పనిచేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.



దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- **దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం**
- **ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య**
- **ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ**

హైదరాబాద్, (డీడీ9వార్త):

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయస్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు.

ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు.

గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.





కవిత ప్రశ్నలకే సమాధానాలు లేవు

- **హరీశ్ రావును గుంటనక్క అని కవితే అన్నారన్న అద్దంకి**
- **కేసీఆర్ కుమారుడు కావడమే కేటీఆర్ ఏకైక అర్హత అని విమర్శ**
- **బీఆర్ఎస్ హయాంలో ఉద్యమకారులపై కేసులు పెట్టారని ఆరోపణ**

హైదరాబాద్, (డీడీ9వార్త):

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుపై తెలంగాణ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత కుటుంబ సభ్యురాలైన కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు కూడా వారిద్దరి వద్ద సమాధానాలు లేవని ఆయన ఎద్దేవా చేశారు. డబ్బులు ఖర్చు పెట్టి కృత్రిమ ప్రచారాలు, పాటలు చేయించడం మాని, ముందు ఇంట్లో చెల్లి అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ కు హితవు పలికారు.

హరీశ్ రావును 'గుంటనక్క' అని కవితే అన్నారని అద్దంకి తెలిపారు. కేసీఆర్ కొడుకు కావడం తప్ప కేటీఆర్‌కు నాయకత్వ అర్హతలే మీ లేవని, ఆ కుటుంబ సంబంధం లేకపోతే ఆయనకు రాజకీయ మనుగడ సున్నా అని విమర్శించారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడాన్ని కేటీఆర్ తప్పుబట్టడం ఆయన నియంతృత్వ ధోరణికి నిదర్శనమని అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారి పార్టీ ఎమ్మెల్యేలకు నిధులు దోచుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని విమర్శించారు. అదే సమయంలో సొంత పార్టీలోని గిరిజన ఎమ్మెల్యేల విషయంలో మాత్రం వివక్ష చూపారని అద్దంకి ఆరోపించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తులతో కలిసి కేసీఆర్ కుటుంబం ఫామ్‌హౌస్‌లు, అక్రమ వ్యాపారాలు నడిపిందని దుయ్యబట్టారు. పదేళ్ల పాలనలో తెలంగాణ ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేసి, కోదండరాం, మందకృష్ణ మాదిగ వంటి ఉద్యమ నాయకులపై కేసులు పెట్టి జైలుకు పంపారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి రానివ్వకూడదని రాష్ట్ర ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

సీఎం సొంత నియోజకవర్గంలో కూల్చివేతలా?

మొదటిపేజీ తరువాయి

ప్రజల ఇళ్లనే కూల్చివేయడం ఏమిటని నిలదీశారు.

కనీసం నోటీసులు ఇవ్వకుండా, న్యాయస్థానాల తీర్పులను సైతం లెక్కచేయకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని కూల్చివేతలు చేపట్టడం ప్రజాపాలన కాదని హరీశ్‌రావు విమర్శించారు. దశాబ్దాలుగా అక్కడే నివాసం ఉంటున్న నిరుపేదలను అర్ధరాత్రి రోడ్డున పడేయడం అత్యంత కర్కశమైన చర్యగా అభివర్ణించారు.

అధికారం ఉందనే కారణంతో ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించకూడదని హరీశ్‌రావు అన్నారు. ఇళ్లను కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తావించే యూపీఏ హయాంలో తీసుకొచ్చిన భూసేకరణ చట్టం 2013 ప్రకారం ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి న్యాయమైన పరిహారం, మెరుగైన పునరావాసం కల్పించాలని కోరారు. పేదల బతుకులను చిన్నాభిన్నం చేస్తున్న ఈ చర్యలను బీఆర్ఎస్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఓట్ చోరీపై దూకుడుగా వెళ్దాం

- **కాంగ్రెస్ కార్యకర్తలు యాక్టివ్ అవ్వాలి**
- **రెండేళ్లుగా ఓట్ల చోరీ అంశాన్ని ప్రస్తావిస్తున్నానన్న రాహుల్**
- **తొలుత పార్టీ నేతల్లో కొందరు తన వాదనను అంగీకరించలేదని వ్యాఖ్య**
- **ఇప్పుడు అందరూ అంశాన్ని అర్థం చేసుకున్నారని వెల్లడి**
- **ఎన్నికల ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచన**
- **ఈవీఎంలపై ప్రశ్నలను బలంగా ప్రస్తావించాలని సూచన**
- **సీడబ్ల్యూసీ సమావేశంలో ఎన్నికల వ్యవస్థపై చర్చ**
- **ఢిల్లీ బేలా ఎస్టేట్‌లో ఓటర్ల పేర్ల తొలగింపును ప్రస్తావించిన రాహుల్**

న్యూఢిల్లీ, (డీడీ9వార్త):

ఓట్ల చోరీ అంశాన్ని తాను గత రెండేళ్లుగా ప్రస్తావిస్తున్నప్పటికీ కాంగ్రెస్ నేతల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించలేదని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పుడు పార్టీ నేతలు ఈ అంశాన్ని అర్థం చేసుకున్నారని ఆయన వ్యాఖ్యానించినట్లు వార్తలు వెలువడ్డాయి. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాహుల్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని రాహుల్ పార్టీ నేతలకు సూచించినట్లు తెలుస్తోంది. ఓటర్ల జాబితాల్లో అవకతవకలతో పాటు ఈవీఎంలకు సంబంధించిన ప్రశ్నలను కూడా బహిరంగంగా ప్రస్తావించాలని చెప్పినట్లు సమాచారం. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ గతంలో చేసిన ఆరోపణలను కూడా ఆయన సమావేశంలో ప్రస్తావించినట్లు వార్తలు వచ్చాయి.

బేలా ఎస్టేట్‌పై రాహుల్ ఆరోపణలు



ఢిల్లీ యమునా తీరంలోని బేలా ఎస్టేట్‌లో ఓటర్ల పేర్ల తొలగింపుపై రాహుల్‌గాంధీ సోమవారం ప్రశ్నలు లేవనెత్తారు. అక్కడ 728 మంది ఓటర్లు ఉండగా.. SIR అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాలో ఒక్కరి పేరు మాత్రమే మిగిలిందని ఆయన ఆరోపించారు. మిగిలిన 727 మంది పేర్లు తొలగించారని పేర్కొన్నారు. ఈ అంశంపై స్థానిక ఎస్‌డీఎంతో రాహుల్ మాట్లాడిన వీడియోను కూడా సోషల్ మీడియాలో విడుదల చేశారు.

అయితే 727 మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి పూర్తిగా తొలగించినట్లు కాకుండా ఏఎస్‌డీడీ జాబితాలో ఉంచినట్లు ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. బేలా ఎస్టేట్‌లో గతంలో ఇళ్లు కూల్చివేయడం, అక్కడి నివాస పరిస్థితుల్లో మార్పుల నేపథ్యంలో ఈ పేర్లను ఆ జాబితాలో చేర్చినట్లు ఈసీ పేర్కొంది.

ఓటర్ల జాబితా సవరణపై వివాదం

సర్ ప్రక్రియ, ఓటర్ల పేర్ల తొలగింపు, ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘం సర్ కు సంబంధించిన చర్యలు చట్టపరమైన ప్రక్రియకు అనుగుణంగానే జరుగుతున్నాయని చెబుతోంది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ సమావేశంలో ఎన్నికల వ్యవస్థపై పార్టీ తదుపరి కార్యాచరణపై చర్చ జరిగింది. కాగా, ఓటర్ల జాబితా, సర్ అంశాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ తన రాజకీయ ప్రచారాన్ని కొనసాగించాలని రాహుల్ సూచించినట్లు సమాచారం.

మరో తుగ్లక్ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హైదరాబాద్, (డీడీ9వార్త):

తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు.

చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు.


దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యం మేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

దళితులు, ఆదివాసీలు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలి

హైదరాబాద్, (డీడీ9వార్త):

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దళితులు, ఆదివాసీలు తమ ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సినఅవసరం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్‌క్లబ్‌లో నిర్వహించిన దళితఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు, దళిత, ఆదివాసీ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.అంటరానితనానికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ అధ్యక్షతన తీర్మానం జరిగిందని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. అనంతరం దళితుల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం తీసుకొచ్చారని తెలిపారు. మనుధర్మ శాస్త్రం పేరుతో వెనుకబడిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులపై అట్రాసిటీలు ఆగాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని భట్టి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఉత్తరాఖండ్‌లో ఎదురైన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. అంచెలంచెలుగా ఎదిగిన ఖర్గేసీఎల్పీ నేతగా, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా, ప్రస్తుతం ఏఐసీసీ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఖర్గే హోజరైన వేదికను అనంతరం శుద్ధి చేయడం అత్యంత దారుణమని భట్టి విమర్శించారు. బీజేపీ పాలనలో దళితులను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారనే భావన కలుగుతోందని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, అప్పుడే ప్రతి ఒక్కరికీ రక్షణ, సమానత్వం దక్కుతాయని అన్నారు.



మనువాద భావజాలాన్ని అమలు చేస్తున్నారని ఆరోపణ

దేశంలో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా బీజేపీ పాలన కొనసాగుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. సమాజానికి వ్యతిరేకంగా మనువాద భావజాలాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో అంటరానితనాన్ని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు.

ఉత్తరాఖండ్‌లో ఖర్గే సమావేశం అనంతరం జరిగిన పరిణామాలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోందని దయాకర్ అన్నారు. తెలంగాణలో గతంలో కాంగ్రెస్ దళిత నేతలు కేసీఆర్ ఫామ్‌హౌస్ పద్దకు వెళ్లిన సందర్భంగా పసుపు నీళ్లు చల్లిన ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. ఖర్గేపై జరిగిన ఘటనను రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అద్దంకి దయాకర్ అన్నారు. ఈ విషయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాఖ్యానించారు. దళితులు, ఆదివాసీల ఆత్మ గౌరవం, హక్కులు, సమానత్వం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు.

నిమ్స్ అధికారిపై ఏసీబీ సోదాలు..

- **బినామీల ఇళ్లలో ఏసీబీ సోదాలు**
- **రూ.4.94 లక్షల నగదు స్వాధీనం**
- **రూ.2.70 కోట్ల ప్లాట్ పత్రాలు గుర్తింపు**
- **పెట్టుబడులు, భూముల డాక్యుమెంట్లపై దర్యాప్తు**

నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆయనకు సంబంధించిన అనుమానితులు, బినామీల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నగదు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలు, ఓపెన్ ప్లాట్ డాక్యుమెంట్లు, పెట్టుబడులకు సంబంధించిన వివరాలతో పాటు పలు కీలక ఆధారాలను అధికారులు గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది.

ధనరాజ్ ఇంట్లో నగదు స్వాధీనం

ఏసీబీ తనిఖీల్లో నిమ్స్ ఉద్యోగి ధనరాజ్ ఇంట్లో రూ.4,94,394 నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. అలాగే మహేశ్వరం ప్రాంతంలో మూడు వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ఈ భూముల విలువ సుమారు రూ.57 లక్షలు ఉంటుందని ఏసీబీ ప్రాథమికంగా పేర్కొంది.

బంజారాహిల్స్‌లో రూ.2.70 కోట్ల ప్లాట్

బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు కూడా సోదాల్లో బయటపడ్డాయి. ఈ ప్లాట్ విలువ సుమారు రూ.2.70 కోట్లు ఉంటుందని ఏసీబీ వివరించింది. ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఎవరిపేర్లపై ఉన్నాయి, వాటికి నోరి లక్ష్మీ భాస్కర్‌తో ఉన్న సంబంధం ఏంటి అనే కోణంలో అధికారులు వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగి పేరుతో పెట్టుబడులు

నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి డి. గణేష్ పేరుతో సుమారు రూ.20 లక్షల పెట్టుబడులకు సంబంధించిన వివరాలను కూడా ఏసీబీ గుర్తించింది. మరో వ్యక్తి పేరుతో ఉన్న పెట్టుబడుల వివరాలు కూడా అధికారుల దృష్టికి వచ్చినట్లు ప్రెస్ నోట్‌లో పేర్కొంది. వీటితో పాటు రూ.3 లక్షల హ్యాండ్ లోన్‌కు సంబంధించిన రసీదులను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

మరిన్ని ఆస్తులపై దర్యాప్తు

సోదాల్లో లభించిన పత్రాలు, నగదు, పెట్టుబడుల వివరాలు, ఇతర ఆధారాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. నోరి లక్ష్మీ భాస్కర్‌కు తెలిసిన ఆదాయ వనరులతో పోలిస్తే గుర్తించిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని లెక్కించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఏసీబీ తెలిపింది. ఇప్పటికే సోదాల్లో భారీగా స్థిర, చరాస్తులకు సంబంధించిన వివరాలు బయటపడినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ఏసీబీ సెప్టెంబర్ 21న కేసు నమోదు చేసినట్లు మీరు అందించిన ప్రెస్ నోట్‌లో పేర్కొంది. ఆ కేసు దర్యాప్తులో భాగంగానే అనుమానితులు, బినామీలుగా భావిస్తున్న వ్యక్తులకు సంబంధించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ వెల్లడించింది. సోదాల్లో లభించిన ఆధారాల ఆధారంగా మరిన్ని ఆస్తులు, పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

ములుగు జిల్లాకు మంజూరైన నూతన న్యాయ స్థానాన్ని ఏటూరునాగారంలో ఏర్పాటు చేయాలి

- **ఆరు మండలాల ప్రజలకు న్యాయ సేవలు చేరువ అవుతాయి: రాజమల్ల సుకుమార్**



మంగపేట సెప్టెంబర్ 29డీడీ9 వార్త

ములుగు జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-అదనపు ప్రథమ శ్రేణి న్యాయ మూర్తి న్యాయస్థానాన్ని ఏటూరునాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని తెలంగాణ మాల మహానాడు ములుగు జిల్లా అధ్యక్షుడు, ములుగు జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ జిల్లా సభ్యుడు రాజమల్ల సుకుమార్ కోరారు.

ఈ సందర్భంగా రాజమల్ల సుకుమార్ మాట్లాడుతూ.. 2026 సెప్టెంబర్ 24న తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 59 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 200 నూతన అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి న్యాయస్థానాలను మంజూరు చేసిందని తెలిపారు. అందులో భాగంగా ములుగు జిల్లాకు కూడా ఒక నూతన న్యాయస్థానం మంజూరైందని పేర్కొన్నారు.

ప్రస్తుతం ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి, ఏటూరునాగారం మండలాలకు చెందిన ప్రజలు న్యాయ సేవల కోసం ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఆయా ప్రాంతాల నుంచి ములుగు వరకు సుమారు 60 నుంచి 120 కిలోమీటర్ల వరకు ప్రయాణించాల్సి రావడంతో కక్షిదారులు, సాక్షులు, మహిళలు, వృద్ధులు, పేదలు, మారుమూల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రతి కేసు విచారణకు జిల్లా కేంద్రానికి వెళ్లడం వల్ల ప్రజలకు ప్రయాణ ఖర్చులు, సమయం, ఆర్థిక భారం పెరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్న మారుమూల గ్రామాల ప్రజలు న్యాయస్థానాలకు హాజరు కావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

అదేవిధంగా కేసులకు సంబంధించిన సాక్షులను న్యాయస్థానానికి హాజరుపరచడంలో పోలీసు శాఖకు కూడా సమయం, సిబ్బంది, రవాణా పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఏటూరునాగారంలో న్యాయస్థానం ఏర్పాటు చేస్తే పోలీసు అధికారులు, దర్యాప్తు సిబ్బంది, సాక్షులు కూడా కోర్టు కార్యకలాపాలకు సులభంగా హాజరయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు.

ఏటూరునాగారం ఆరు మండలాలకు భౌగోళికంగా అనుకూలమైన కేంద్ర ప్రాంతమని రాజమల్ల సుకుమార్ తెలిపారు. ఏటూరునాగారంలో నూతన న్యాయస్థానం ఏర్పాటు చేస్తే వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ అవుతాయని అన్నారు.

దీంతో ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన దూరం తగ్గడంతో పాటు ప్రజలకు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయ సేవలు పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన, గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఏటూరునాగారం పోలీసు విభాగం పరిధిలోనే న్యాయస్థానం ఏర్పాటు చేయడం వల్ల పోలీసు శాఖ, న్యాయ వ్యవస్థ మధ్య సమన్వయం మరింత మెరుగుపడే అవకాశం ఉంటుందని అన్నారు. కేసుల విచారణకు సంబంధించిన ప్రక్రియల్లో కక్షిదారులు, సాక్షులు, పోలీసు అధికారులు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులు కూడా తగ్గుతాయని వివరించారు.

ప్రజలకు న్యాయం మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి రావాలంటే ములుగు జిల్లాకు మంజూరైన నూతన న్యాయస్థానాన్ని ఏటూరునాగారం మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయడం అవసరమని రాజమల్ల సుకుమార్ అన్నారు. ప్రజల ఇబ్బందులను, ఆరు మండలాల భౌగోళిక పరిస్థితులను, ప్రయాణ దూరాన్ని పరిగణనలోకి తీసుకుని ములుగు జిల్లాకు మంజూరైన నూతన న్యాయస్థానాన్ని ఏటూరునాగారంలో ఏర్పాటు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత న్యాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీలో దళిత–ఆదివాసీ సమావేశంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...

- **అట్టడుగు వర్గాల సమస్యలపై జాతీయ స్థాయి వేదికగా ఢిల్లీ సమావేశం...**
- **దళిత, ఆదివాసీల హక్కులు, అభివృద్ధి, విద్య, ఉపాధి అంశాలపై విస్తృత చర్చ...**
- **అశ్వారావుపేట ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే...**







అశ్వారావుపేటసెప్టెంబర్ 29 డిడి 9 వార్త

దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన దళిత-ఆదివాసీ సమావేశంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దళిత, ఆదివాసీ వర్గాలకు సంబంధించిన సమస్యలు, సామాజిక న్యాయం, అభివృద్ధి, విద్య, ఉపాధి, రాజ్యాంగ హక్కులు, సంక్షేమం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిపారు.

అశ్వారావుపేట నియోజకవర్గం గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలతో కూడిన నియోజకవర్గం కావడంతో అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయి వేదికపై ప్రస్తావించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. గిరిజన గ్రామాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి, మౌలిక వసతుల కల్పన, వైద్య సదుపాయాల విస్తరణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని సమావేశంలో వివరించినట్లు తెలిపారు.

అట్టడుగు వర్గాల అభివృద్ధే లక్ష్యంగా...

దళిత, ఆదివాసీ వర్గాల అభివృద్ధి కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, సామాజిక ప్రాతినిధ్యం వంటి అన్ని రంగాల్లో సమగ్రంగా జరగాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు.

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తే సంక్షేమ పథకాల అమలులో మరింత ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఏజెన్సీ ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టి

అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక గిరిజన గ్రామాలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రస్తావించినట్లు తెలిపారు.

వర్షాకాలంలో మారుమూల గిరిజన గ్రామాలకు రాకపోకలు, అత్యవసర వైద్య సేవలు, విద్యార్థుల రవాణా వంటి అంశాలు ఇబ్బందికరంగా మారకుండా శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు అవసరమని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని, మంచి రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తే విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి తదితర రంగాల్లో ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వివరించినట్లు తెలిపారు.

గిరిజన యువతకు విద్య, ఉపాధి అవకాశాలు

ఏజెన్సీ ప్రాంతాల్లో యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు పెంచడంపై ప్రత్యేక దృష్టి అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే గిరిజన విద్యార్థులకు అవసరమైన వసతి, శిక్షణ, మార్గదర్శకత్వం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు శిక్షణా అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి మార్గదర్శకత్వం అందిస్తే వారు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోగలరని తెలిపారు.

యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

గిరిజన విద్యార్థుల భవిష్యత్తుపై చర్చ

గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం వంటి అంశాలపై సమావేశంలో ప్రాధాన్యతగా చర్చించినట్లు తెలిపారు.

ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు నిరంతర సహకారం అందితేనే గిరిజన సమాజంలో దీర్ఘకాలిక మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చర్చించారు.

గిరిజన విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వృత్తి విద్య వైపు వారిని ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు.

మహిళల సాధికారతకు ప్రాధాన్యం

దళిత, ఆదివాసీ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహాయం అందించడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడం, చిన్నతరహా వ్యాపారాలు, వ్యవసాయ ఆధారిత ఉపాధి, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రోత్సాహం అందించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చర్చించారు.

ఆరోగ్య సేవల విస్తరణ అవసరం

మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని కూడా ఎమ్మెల్యే ప్రస్తావించినట్లు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడం, అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచడం, అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలకు రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలు గిరిజన ప్రాంతాల ప్రజలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో దీర్ఘకాలిక అభివృద్ధికి పునాది వేయవచ్చని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిపారు.

రాజ్యాంగ హక్కులపై అవగాహన

దళిత, ఆదివాసీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమ కార్యక్రమాలు, చట్టపరమైన రక్షణలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు.

గ్రామస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం, అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనాలు పొందలేకపోతున్న వారికి అధికార యంత్రాంగం ద్వారా సహకారం అందించడం అవసరమని పేర్కొన్నారు.

అశ్వారావుపేట సమస్యలను జాతీయ వేదికపై ప్రస్తావించిన ఎమ్మెల్యే

అశ్వారావుపేట నియోజకవర్గంలోని దళిత, ఆదివాసీ ప్రజల సమస్యలను ఢిల్లీ సమావేశం వేదికగా ప్రస్తావించడం ద్వారా స్థానిక సమస్యలకు జాతీయ స్థాయి చర్చల్లో స్థానం కల్పించే ప్రయత్నం చేసినట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు.

నియోజకవర్గంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా ప్రజా సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి విషయంలో స్థానిక అవసరాలను గుర్తించి, ప్రజలకు నేరుగా ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

సమగ్ర అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం

దళిత, ఆదివాసీ వర్గాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, సామాజిక సంస్థలు, యువత, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు.

సామాజిక సమానత్వం, విద్యా అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను సమగ్రంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఢిల్లీలో జరిగిన దళిత-ఆదివాసీ సమావేశంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను ప్రస్తావించడం నియోజకవర్గ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అశ్వారావుపేట నియోజకవర్గంలోని దళిత, ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వృద్ధుల సేవలో బీజేపీ.. ఆప్యాయతే అసలైన సేవ!

- **'సేవా సంకల్పం'లో భాగంగా వీర్లపల్లి ఈశ్వర కృపా వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం**
- **వృద్ధులను సత్కరించి.. స్వయంగా భోజనం వడ్డించిన బీజేపీ నాయకులు**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 29 (డీడీ9 వార్త):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్పం' కార్యక్రమాల్లో భాగంగా వీర్లపల్లిలోని ఈశ్వర కృపా వృద్ధాశ్రమంలో బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.


బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులను శాలువాలతో సత్కరించి, స్వయంగా భోజనం వడ్డించారు. వారితో కొంతసేపు ఆప్యాయంగా గడిపారు.

ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా 'సేవా సంకల్పం'గా నిర్వహిస్తూ సమాజంలోని వివిధ వర్గాలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వృద్ధులను గౌరవించడం, వారికి ఆప్యాయతను అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. వృద్ధులతో ముచ్చటించి వారి అవసరాలను తెలుసుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని, సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 8వ కాలనీ బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు మూకిరి రాజు, కందుల పోచం, ఆకుల కుమార్ గౌడ్, లింగం నాయక్, జంజర్ల శ్రీనివాస్, కండే సాగర్, ఐలవేని అనిల్‌కుమార్, జక్కన బాలు, ఏరుకొండ తిరుపతి, బూడిద హర్ష, అంగలి సంతోష్ తదితరులతో పాటు వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



తెలంగాణ బిడ్డల హక్కులపై వేటు!

- **జీవో 33, 150లతో స్థానికతకు తూట్లు.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం**
- **వివాదాస్పద జీవోలను తక్షణమే రద్దు చేయాలి: కట్కూరి సందీప్**



పెద్దపల్లి బ్యూరో, (డీడీ9 వార్త):

జీవో 33, జీవో 150ల ద్వారా స్థానికత నిబంధనల్లో మార్పులు చేస్తూ తెలంగాణ విద్యార్థుల హక్కులను దెబ్బతీస్తున్నారని కట్కూరి సందీప్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 1 నుంచి 7వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులను కాదని పక్క రాష్ట్రాల వారికి ప్రయోజనం కలిగించేలా నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమని ఆరోపించారు.

గ్రూప్-1 ఉద్యోగాల నుంచి వైద్య విద్య సీట్ల వరకు తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రొఫెసర్ కోదండరాం, మేధావులు, విద్యార్థి లోకం స్పందించాలని కోరారు. ప్రభుత్వం జీవో 33, 150లను వెంటనే రద్దు చేయాలని కట్కూరి సందీప్ డిమాండ్ చేశారు.



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జనగామ సెప్టెంబర్ 29(డిడి 9వార్త)బ్యూరో

జనగామ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా పట్టణానికి చెందిన 19 మంది, రూరల్ ప్రాంతానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆమె తెలిపారు.

మంధలపల్లిలో మాగ్ విన్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ షాప్ కార్యక్రమంలో పాల్గొన్నా బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం...

అశ్వారావుపేట:సెప్టెంబర్ 29 (డిడి9వార్త)

దమ్మపేట మండలం మంధలపల్లి లో మాగ్ విన్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ షాప్ యాజమాన్యం ఆహ్వానం మేరకు ప్రారంభోత్సవం కార్యక్రమం లో పాల్గొని కొబ్బరి కాయకోట్టి అనంతరం షాప్ నిర్వాహులకు శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం .అనంతరం గోపాలపురం గ్రామం లో బేతి మారేష్ రాజ్య లక్ష్మి దంపతుల కుమారుడు చిరంజీవి భార్గవ రామ్ మొదటి పుట్టినరోజు వేడుకలో పాల్గొని ఆశీర్వధించిన బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు సోయం వీరభద్రం .ఈ కార్యకమం లో పిట్టల అర్జునరావు, మురహరి శ్రీను,కూకలకుంట రవి,మాజీ MPTC గంటా వెంకటేశ్వరరావు ,నారం శ్రీను తధితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు




కన్నాయిగూడెం నూతన ఎస్ఐ పుట్ట సతీష్ బాధ్యతలు

కన్నాయిగూడెం,సెప్టెంబర్ 29(డిడి9 వార్త)

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం నూతన ఎస్ఐ గా పుట్ట సతీష్ మంగళవారం రోజున బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) నుంచి కన్నాయిగూడెం మండలానికి బదిలీపై వచ్చారు.పదవి బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ పుట్ట సతీష్ ను స్థానిక ఎస్ఐ వెంకటేష్ మరియు సివిల్ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కన్నాయిగూడెం ఎస్ఐ గా విధులు నిర్వర్తించిన ఇనిగాల వెంకటేష్ అసిఫాబాద్ జిల్లాకు ట్రాన్స్ఫర్ గా వెళ్లారు.





సహపంక్తి భోజనంతో ఐక్యతకు చాటింపు

జనగామ సెప్టెంబర్ 29(డిడి 9వార్త)బ్యూరో

జనగామ మున్సిపాలిటీలో నూతనంగా కొనుగోలు చేసిన 16 చెత్త సేకరణ ఆటోల ప్రారంభోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి సహపంక్తిభోజనం చేశారు.మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందరితో ఒకే పంక్తిలో కూర్చొని భోజనం చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ.. జనగామ అభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







ఎలిశెట్టిపల్లికి ఏమి కష్టాలు బాబోయ్..!

- **వర్షా లకు కొట్టుకుపోయిన రోడ్డు.. పడవతో వాగు దాటాల్సిందే..!**
- **వర్షా కాలం వచ్చిందంటే గ్రామస్తులకు తప్పని అవస్థలు..**
- **రోడ్డు ఉన్నా ప్రయోజనం లేదు.. పట్టించుకునే నాథుడే కరువు..!**
- **ఇప్పటికైనా మంత్రి సీతక్క మా గ్రామ రోడ్డును పరిశీలించాలి: గ్రామస్తుల వేడుకోలు**

ఏటూరునాగారం, క్రైం, డి డి 9 వార్త, సెప్టెంబర్ 29

వర్షాలు కురిస్తే చాలు..ఎలిశెట్టిపల్లె గ్రామస్తులకు కష్టాలు మొదలవుతున్నాయి.వర్షాకాలం వచ్చిందంటే గ్రామం నుంచి బయటకు వెళ్లాలన్నా..ఇతర ప్రాంతాల నుంచి గ్రామంలోకి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండల పరిధిలో గోదావరి ఒడ్డున ఉన్న ఎలిశెట్టిపల్లెకు వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా ఇబ్బందికరంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షా లకు కొట్టుకుపోయిన రోడ్డు..!

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామానికి ఉన్న రహదారి కొంతమేర కొట్టుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామస్తులకు కాలినడకనే దిక్కుగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో కూడా గ్రామంలోకి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదని వారు చెబుతున్నారు.రోడ్డు దెబ్బతినడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి, గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఏళ్లుగా ఇదే సమస్య కొనసాగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

పడవే దిక్కు.. రోడ్డు గత్యంతరమా..?

గోదావరి ఉధృతంగా ప్రవహించే సమయంలో గ్రామానికి రాకపోకలు మరింత కష్టతరంగా మారుతున్నాయి.దీంతో గ్రామస్తులు నాటు పడవలపై ఆధారపడాల్సి వస్తోంది.ఒకసారి పడవలో 50 మంది వరకు..అవసరాన్ని బట్టి దాదాపు 100 మంది వరకు ప్రయాణించాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. అయితే గోదావరి ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో పడవ ప్రయాణం కూడా ప్రమాదకరంగా మారుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాగులు,గోదావరి దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షా కాలం వచ్చిందంటే కన్నీళ్లే..!

గ్రామానికి సరైన రహదారి లేకపోవడం,వర్షాలు కురిసినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోవడం ఎలిశెట్టిపల్లె ప్రజలకు ఏళ్లనాటి సమస్యగా మారింది. అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రికి తరలించాలన్నా..అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లాలన్నా నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు అంటున్నారు.“ప్రతి వర్షాకాలంలో ఇదే బాధ..రోడ్డు కొట్టుకుపోతుంది..పడవ ఎక్కి వాగు దాటాల్సి వస్తోంది.మా కష్టాలు ఎన్నటికీ తీరవా..?”అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి సీతక్క దృష్టి సారించాలి...

ఎలిశెట్టిపల్లె గ్రామానికి శాశ్వత రహదారి సౌకర్యం కల్పించి, వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.సమస్యను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి, అధికారులు గ్రామాన్ని సందర్శించి రహదారి పరిస్థితిని పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పడవలపై ఆధారపడే పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపాలని,రహదారి నిర్మాణం చేపట్టి ఎలిశెట్టిపల్లె ప్రజల కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.





ప్యారడైస్ హీరో నాని మేడారం లో మొక్కులు..!!


- **తులాభారం తూగిన హీరో.. 74 కిలోలు**
- **ఘనస్వాగతం పలికిన దేవస్థానం అధికారులు, పూజారులు..**
- **భారీగా తరలివచ్చిన అభిమానులు, టీఆర్ఎస్ నాయకులు**

ఏటూరునాగారం క్రైం, డి డి 9 వార్త, సెప్టెంబర్ 29

పెరడైజ్ సినిమా హీరో నాని మేడారం సమ్మక్క-సారలమ్మ దేవతలను దర్శించుకున్నారు. మంగళవారం మేడారం చేరుకున్న ఆయనకు దేవస్థానం అధికారులు, పూజారులు డోలు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవతలకు చీర, సారెలు సమర్పించారు.ఈ సందర్భంగా హీరో నాని 74 కిలోల తులాభారం తూగారు. పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు ఆధ్వర్యంలో నాని,ఆయన అనుచరులకు దేవస్థానం శాలువాలతో సన్మానం చేసి దేవతల ప్రసాదాలను అందజేశారు.హీరో నాని మేడారం వచ్చిన విషయం తెలుసుకున్న అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ములుగు జిల్లా పరిధిలోని మంగపేట నుంచి తాడ్వాయి,ఏటూరునాగారం వరకు పలువురు అభిమానులు,యువకులు ఆయనను చూసేందుకు తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ తాడ్వాయి మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, సీనియర్ నేత పిన్నింటి యాదిరెడ్డి, సర్పంచ్ ప్రవళిక గున్ను, తాడ్వాయి యూత్ సభ్యులు, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గడ్డదాసు సునీల్, మల్లారెడ్డి,సహకార సంఘం చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, సర్పంచుల ఫోరం జిల్లా జేఏసీ కన్వీనర్,కాటాపురం సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు, ఉప పాలకుర్తి బాబు, దిలేర్ ఖాన్,సయ్యద్ హుస్సేన్,ఆలేటి ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మేడారం,నార్లాపూర్ గ్రామాలకు చెందిన టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు..!!

హీరో నాని మేడారం సందర్శించిన సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏస్రా సీఐ దయాకర్ ఆధ్వర్యంలో తాడ్వాయి ఎస్సైలు జగదీష్ గౌడ్, మధుకర్‌తో పాటు మరో ఎస్సై, స్పెషల్ పార్టీ, రోప్ పార్టీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తాడ్వాయి సెకండ్ ఎస్సై చింతా నారాయణ,కానిస్టేబుళ్లు రమేష్,ఆర్మీ రమేష్ తదితరులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.నాని దర్శనం నేపథ్యంలో మేడారం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.






డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు

- **ఖమ్మం–భద్రాచలం మార్గంలో నేటి నుంచి అమలు**
- **ఛార్జీ రూ.180 నుంచి రూ.170కు తగ్గింపు**

భద్రాచలం, సెప్టెంబరు 29 (డిడి9 వార్త)

ఖమ్మం-భద్రాచలం మార్గంలో నడిచే డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలను అమలు చేయనున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య తెలిపారు. ఈ మార్పు సెప్టెంబరు 30 నుంచి అమల్లోకి వస్తుందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఖమ్మం-భద్రాచలం మధ్య డీలక్స్ బస్సుల్లో రూ.180గా ఉన్న ఛార్జీని రూ.170కు తగ్గించినట్లు తెలిపారు. మార్గంలోని అన్ని స్టేజీలకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ప్రయాణికులు ఛార్జీల మార్పును గమనించి డీలక్స్ బస్సు సేవలను వినియోగించుకోవాలని డిపో మేనేజర్ జంగయ్య కోరారు.



కేజీబీవీ విద్యార్థినులకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన

చర్ల, సెప్టెంబర్ 29 (డిడి 9 వార్త)


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్య విద్యా బోధకురాలు (హెల్త్ ఎడ్యుకేటర్) డి.పరంగిణి మంగళవారం చర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పాఠశాల,ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడాలని, నిల్వ నీటిలోనే దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వ్యాపిస్తాయని, ప్రతి శుక్రవారం డ్రై డే ని పాటించి కూలర్లు, పూల కుండీలలో నీటిని తొలగించాలని సూచించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత లో భాగంగా ప్రతిరోజూ స్నానం చేయాలని, భోజనానికి ముందు భోజనం తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలని తెలిపారు. బాలికలు రుతుక్రమ సమయంలో శుభ్రమైన ప్యాడ్స్ వాడి, పరిశుభ్రత పాటించాలని వివరించారు. పోషకాహారంగా రోజూ ఆకుకూరలు, కూరగాయలు, పప్పు, గుడ్డు తింటే రక్తహీనత రాదని, చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు బలాన్ని ఇస్తాయని అన్నారు. ప్యాకెట్ ఆహారాలు, శీతల పానీయాలు తగ్గించి, రోజూ 10 గ్లాసుల నీరు తాగాలని సూచించారు. టెలి మానస్ 14416 పరీక్షల భయం, మానసిక ఒత్తిడి, నిద్ర పట్టకపోవడం వంటి సమస్యలు ఉంటే 14416 నంబర్‌కు కాల్ చేస్తే 24 గంటలు ఉచితంగా మానసిక నిపుణులచే సలహా పొందవచ్చని, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తదనంతరం పాఠశాల వంటశాల, వసతి గదులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పాఠశాలను అందంగా, పరిశుభ్రంగా నిర్వహిస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి భాను ప్రియాంక, ఉపాధ్యాయులు, ఆరోగ్య పర్యవేక్షకులు రాంప్రసాద్, మధ్యస్థాయి ఆరోగ్య సంరక్షకురాలు తులసి, ఆరోగ్య కార్యకర్తలు రంగమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.



రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు

- **ఆర్టీఐ అప్పీల్‌పై అక్టోబర్ 3న విచారణ**
- **సమాచారం ఇవ్వడంలో జాప్యంపై మద్దెల దినేష్ అప్పీల్**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 29 (డీడీ9 వార్త):


Case No:10294/SIC-DB/2026 Date: 23-09-2026
Ref :- 1. 6(1) Application dated:30-12-2025 filed before the PIO.
2. 19(1) 1st Appeal dated:24-03-2026 filed before the 1st Appellate Authority.
&&&
Whereas Sri Maddela Dinesh has filed an appeal U/s 19(3) of the RTI Act, 2005 before this Commission against the Public Authority, and whereas the said appeal is posted for hearing on the 03rd day of October, 2026 at 10.30 AM.
A. The Applicant and Respondents are hereby directed to appear in person before the Commission on 03rd day of October, 2026 at 10.30 AM in Court Hall – 1, Ground Floor in Telangana Information Commission, Hyderabad along with written affidavits.
The Respondents are directed to appear along with written affidavits containing:
(i) the action taken (point wise) on 6(1) application / 19(1) appeal.
(ii) copies of letters through which information was furnished to the appellant and proof of dispatch / receipt / acknowledgement by the appellant.
(iii) point wise counter on the 2nd appeal along with enclosed affidavit duly filled in all respects; and
(iv) the Respondent shall file a statement through a copy of the 4(1) (b) data is displayed in the office
(v) download a copy of the affidavit from https://tgic.telangana.gov.in/. fill it out duly, and bring it for submission before the Commission.
B. The Appellant to attend the hearing on the said date and time along with affidavits containing the:
(i) points for which information is not furnished; and
(ii) Points for which information furnished is unsatisfactory / incorrect / false giving complete justification in support of his claim.
(iii) download a copy of the affidavit from https://tgic.telangana.gov.in/. fill it out duly, and bring it for submission before the Commission.
All Appeals will be decided on the basis of material placed before the Commission and as per the merits of the case.
Given under the seal of the Telangana Information Commision on this the 23rd day of September, 2026.
Encl:- (i). 6(1) application; (ii). 19(1) 1st appeal.
// BY ORDER //
SECTION OFFICER
To
Appellant : Sri Maddela Dinesh, S/o. Ramaswamy, H. No. 14-2-164, 8 in clinic, Godavarikhani, Ramagundam Mandal, Peddapalli District-505214.
Respondents : The Public Information Officer (U/RTI Act,2005) / O/o the Municipal Commissioner, Ramagundam Municipality.

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ ఆర్టీఐ చట్టం-2005 కింద మద్దెల దినేష్ దాఖలు చేసిన అప్పీల్‌పై తెలంగాణ సమాచార కమిషన్ విచారణకు నోటీసులు జారీ చేసింది. కేసు నం. 10294/SICDB/2026కు సంబంధించి సెప్టెంబర్ 23న నోటీసులు జారీ అయినట్లు పేర్కొన్నారు.

ఈ కేసులో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ ప్రతివాదులుగా ఉన్నారు. అక్టోబర్ 3న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ సమాచార కమిషన్ గ్రౌండ్ ఫ్లోర్, కోర్ట్ హాల్-1లో విచారణ జరగనుంది. అప్పీలుదారు, ప్రతివాదులు వ్యక్తిగతంగా హాజరై అఫిడవిట్లతో తమ వాదనలు సమర్పించాలని కమిషన్ ఆదేశించినట్లు తెలిపారు.

ఆర్టీఐ దరఖాస్తు, మొదటి అప్పీల్‌పై తీసుకున్న చర్యల వివరాలు, సమాచారం అందించినట్లయితే సంబంధిత లేఖలు, డిస్పాచ్ లేదా రసీదు ఆధారాలు, రెండో అప్పీల్‌పై పాయింట్‌వైజ్ కౌంటర్ తదితర వివరాలను సమర్పించాలని ప్రతివాదులను కమిషన్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. సమాచారం అందని అంశాలు, అందించిన సమాచారం అసంతృప్తికరంగా లేదా తప్పుగా ఉన్న అంశాలను ఆధారాలతో అఫిడవిట్‌లో సమర్పించాలని అప్పీలుదారునూ ఆదేశించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా మద్దెల దినేష్ మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా పొందేందుకు ఆర్టీఐ చట్టం కల్పించిన హక్కును సమర్థవంతంగా వినియోగించుకుంటామని అన్నారు. కమిషన్ విచారణలో సంబంధిత అంశాలను ఆధారాలతో సమర్పిస్తామని తెలిపారు.

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పాలనపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కొందరు అధికారులు అధికార పార్టీ నేతల మాదిరిగా వ్యవహరిస్తున్నారని, అభివృద్ధి కంటే అవినీతి ఆరోపణలే ఎక్కువగా వినిపిస్తున్నాయని విమర్శించారు. కార్పొరేషన్‌లో జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదలందరికీ ఇల్లు పూరి గుడిసెలు లేని తెలంగాణనను మారుస్తాం

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అవుతుంది**
- **ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పారదర్శకంగా జరుగుతుంది**

తాడ్వాయి డిడి9 వార్త



ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారులు , రాజకీయ పార్టీ నాయకులు కానీ ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే పిర్యాదు చేయాలని కోరిన తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామీ ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీల కు అతీతంగానే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు జరుగుతుందని , మొదటి , రెండో విడతలే కాకుండా మూడో విడుత, నాలుగో విడుత ఇళ్లను కూడా మంజూరు అవుతాయని తెలిపారు గత ప్రభుత్వ పాలనలో కొన్నీ నియోజకవర్గాలకు మాత్రమే ఇచ్చారని ,ప్రజా ప్రభుత్వం అలా చేయడం లేదని అన్నారు మంకిడి నరసింహ స్వామి తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు


విద్యార్థి నాయకత్వానికి ఇదో తొలి అడుగు.. భవిష్యత్ బాధ్యతలకు బాటలు

- **షైన్ హైస్కూల్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలు..**
- **ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల పేర్లు వెల్లడి..**
- **అభినందించిన పాఠశాల యాజమాన్యం**

బోనకల్,సెప్టెంబర్ 29, (డీడీ9 వార్త):

స్థానిక షైన్ హైస్కూల్‌లో ఈ నెల 19న నిర్వహించిన స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలను మంగళవారం వెల్లడించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన పెంపొందించేందుకు నిర్వహించిన ఈ ఎన్నికల్లో వివిధ బాధ్యతలకు విద్యార్థులు ఎన్నికయ్యారు.

స్కూల్ హెడ్ బాయ్‌గా 9వ తరగతి విద్యార్థి వేణు, హెడ్ గర్ల్‌గా మేధ ఎన్నికయ్యారు.డిసిప్లిన్ ఇన్‌చార్జిగా యామిని (9వ తరగతి), డిప్యూటీ డిసిప్లిన్ ఇన్‌చార్జిగా ప్రణవి (5వ తరగతి), డిప్యూటీ హెడ్ బాయ్‌గా లాల్ షకీల్ (6వ తరగతి), డిప్యూటీ హెడ్ గర్ల్‌గా శ్రీ ఉపేక్ష (8వ తరగతి) ఎన్నికయ్యారు.హెడ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జిగా వినయ్ (9వ తరగతి), డిప్యూటీ స్పోర్ట్స్ ఇన్‌చార్జిలుగా భాను ప్రకాష్, యువతేజ్ (5వ తరగతి), స్పోకెన్ ఇంగ్లీష్ ఇన్‌చార్జిగా గురుచరణి (6వ తరగతి), డిప్యూటీ స్పోకెన్ ఇంగ్లీష్ ఇన్‌చార్జిగా నఫిషా (5వ తరగతి) ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ షేక్ అస్సర్ పాషా, ప్రిన్సిపాల్ అయిటిపాముల శ్వేత ఎన్నికైన విద్యార్థులను అభినందించారు, అనంతరం వారు మాట్లాడుతూ విజయం సాధించిన ప్రతి విద్యార్థి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు,ఓటమి చెందిన వారు నిరుత్సాహపడకుండా భవిష్యత్‌లో మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలనీ విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందజేశారు.ఈ రోజు పాఠశాల స్థాయిలో వేసిన ఈ నాయకత్వ అడుగులే.. రేపటి సమాజానికి బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దే తొలి మెట్లు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

- ఒంటరి మహిళ కుటుంబం చీకట్లో!
- అందరికీ కనెక్షన్లు ఇచ్చి.. ఒక్క కుటుంబాన్ని విస్మరించిన అధికారులు
- "రేపు వేస్తాం" అంటూ వెళ్లిపోయిన సిబ్బంది..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబం





బోనకల్,సెప్టెంబరు 29, (డీడీ9 వార్త):

మండల పరిధిలోని రావినూతల గ్రామంలో ఎస్సీ కాలనీలో విద్యుత్ అధికారులు చేపట్టిన కొత్త స్తంభాల ఏర్పాటు పనుల్లో నిర్లక్ష్యం వెలుగుచూసింది. కొత్త స్తంభాలకు విద్యుత్ లైన్లు బిగించే క్రమంలో గ్రామంలోని పలువురి ఇళ్లకు తిరిగి విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసిన అధికారులు.. తాళ్లూరి నిర్మల భర్త కాస్య (ఆదమ్) లేటు అనే ఒంటరి మహిళ కుటుంబానికి మాత్రం కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో మంగళవారం రాత్రి ఆ కుటుంబం విద్యుత్ లేక చీకట్లో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముందుగా విద్యుత్ స్తంభానికి లైన్ బిగిస్తామని చెప్పిన అధికారులు (లైన్ మెన్ శేషగిరి),అనంతరం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ "ఇప్పుడు వీలుకాదు.. రేపు వేస్తాం" అంటూ వెళ్లిపోయినట్లు బాధిత కుటుంబం వాపోయింది.

ఒకవైపు అందరికీ విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరిస్తూ, మరోవైపు ఒంటరి మహిళ కుటుంబాన్ని మాత్రం పట్టించుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి కుటుంబానికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్

- పట్టభద్రుల ఓటింగ్ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ సమావేశంలో రావులపల్లి

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 29 (డీ డీ 9 వార్త)

భద్రాచలం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు, గ్రామబాధ్యులందరూ పట్టభద్రుల ఓటింగ్ నమోదుపై ప్రత్యేక దృష్టి నిలపాలని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన పట్టభద్రుల ఓటింగ్ నమోదు సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటింగ్ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానను వివరించడంతో పాటు ఓటింగ్ నమోదుకు సంబంధించి వివిధ సమన్వయ కమిటీలను నియమించారు. అలాగే గ్రామ, వార్డు కమిటీల ఏర్పాటుతో పాటు ఓటింగ్ నమోదు చేసేందుకు అనుసరించాల్సిన ప్రక్రియను వివరించారు. 2023 నవంబరు వరకు డిగ్రీ, సమాన అర్హత కలిగిన కోర్సులను పూర్తి చేసిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేర్పించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని దిశ నిర్దేశం చేశారు. త్వరలో పట్టభద్రుల ఓటింగ్‌పై మరోసారి సమావేశం ఉంటుందని, ఈలోపు ఓటింగ్ నమోదుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పట్టుసాధించాలన్నారు. మీ వార్డులు, కాలనీల్లో ఉండే మహిళ గ్రాడ్యుయేట్లపై ప్రత్యేక దృష్టి నిలపాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు ప్రబోద్‌కుమార్, ఆకోజు సునీల్, ప్రేమ్‌కుమార్, కాపుల రవి, ఉడతా రమేష్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ముఖ్యంగా నిరుద్యోగ యువతకు తగినన్ని ఉద్యోగ, ఉపాధి మార్గాలను చూపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. భద్రాచలం పట్టణంలో వార్డుల వారీగా పట్టభద్రులను గుర్తించడంతో పాటు వారి ఓటు నమోదు చేయడంలో అనుసరించాల్సిన ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో పాపినేని రామాంస, రేపాక పూర్ణ, తుమ్మలపల్లి ధనేశ్వరరావు, కొంముక్కల సాయిబాబా, ఎండీ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్

- ఆరోగ్యంపై అవగాహనతోనే ఆరోగ్యవంతమైన సమాజం
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 29 (డీ డీ 9 వార్త)

విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండె ఆరోగ్యంతో పాటు పలు ఆరోగ్య అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయడం, పొగాకు, మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం, ఒత్తిడిని నియంత్రించుకోవడం, తగినంత నిద్ర పొందడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు. చెవుల ఆరోగ్యం, వినికిడి లోపాలు, పోషకాహారం, పాముకాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నషా ముక్త్ భారత్ అభియాన్ తదితర అంశాలపై కూడా అవగాహన కల్పించారు. విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండటంతో పాటు వాటి వల్ల కలిగే అనర్థాలపై సమాజంలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏడీఎంహెచ్ఓ బి. సైదులు, డీపీఎంఓ మోహన్ తేజావత్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ విల్సన్, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ సుందాకర్, ఇతర అధ్యాపకులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కోల్‌బెల్ట్ ప్రాంతాల అభివృద్ధి, కార్మికుల సమస్యలపై సమగ్ర సమీక్ష..

- పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

మణుగూరు. సెప్టెంబర్ 29 (డి డి 9వార్త)

తెలంగాణ రాష్ట్రంలోని కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతి, కార్మికులు, స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.
తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి అధ్యక్షతన, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భశాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో ఈ సమావేశం జరిగింది.ఈ సమీక్ష సమావేశంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ శాసనసభ షెడ్యూల్డ్ తెగల (ST) సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ పోరిక బలరాం నాయక్, కోల్‌బెల్ట్ ప్రాంతాలకు చెందిన పలువురు శాసనసభ్యులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా పలు కోల్‌బెల్ట్ ప్రాంతాలకు సంబంధించిన అభివృద్ధి పనులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక ప్రజల అవసరాలు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతుల కల్పనపై సంబంధిత ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు.
కోల్‌బెల్ట్ ప్రాంతాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, బొగ్గు గనుల కార్యకలాపాల వల్ల ప్రభావితమవుతున్న ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పినపాక నియోజకవర్గ పరిధిలోని కోల్‌బెల్ట్ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, కార్మికుల సమస్యలను పరిష్కరించి, స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరచాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో పలు కోల్‌బెల్ట్ ప్రాంతాలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆయా ప్రాంతాల్లోని సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరాలను సమర్పించారు.



లబ్ధిదారులకు CMRF, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..

- అందజేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

మణుగూరు. సెప్టెంబర్ 29(డి డి 9వార్త)

పినపాక మండలం బయ్యారం క్రాస్ రోడ్డు లోగల ఫంక్షన్ హాల్ లో ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF), కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అనారోగ్య సమస్యలతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పినపాక మండలం, కరకగూడెం మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) కింద మొత్తం రూ.5,37,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. అత్యవసర వైద్య చికిత్స అవసరమైన సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు CMRF ద్వారా అందుతున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.అదే విధంగా ఆడపిల్లల వివాహ సమయంలో పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 28 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.28,03,248 విలువైన చెక్కులను అందజేశారు.పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా అనారోగ్య సమయంలో CMRF ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం, ఆడపిల్లల వివాహ సమయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అందుతున్న సహాయం కుటుంబాలకు ఎంతో తోడ్పాటుగా నిలుస్తుందని తెలిపారు.పినపాక నియోజకవర్గంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా.. CMRF, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఆర్ఓ, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







శస్త్రచికిత్స అనంతరం మాధవ రెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 29 (డీ డీ 9 వార్త)

గుండె శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్ నుంచి భద్రాచలం వెంకటేశ్వర కాలనీలోని తన నివాసానికి చేరుకున్న ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవ రెడ్డిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం పరామర్శించారు. మాధవ రెడ్డి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం పూర్తిగా కోలుకునే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని, వైద్యుల సూచనల మేరకు మందులు క్రమం తప్పకుండా తీసుకుంటూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని తిరిగి ప్రజల్లోకి వచ్చి ప్రజా సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. అప్పటివరకు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా విశ్రాంతి తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, చేగొండి శ్రీనివాస్, యువ నాయకులు మాచినేని భాను, గాడి విజయ్ తదితరులు పాల్గొన్నారు

అనారోగ్యంతో కొత్తగూడెం సింగరేణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పరామర్శించిన.. ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.

మణుగూరు. సెప్టెంబర్ 29(డి డి 9వార్త)

మణుగూరు సింగరేణి ఏరియా కొండాపురం భూగర్భ గనిలో అసిస్టెంట్ చైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న దినేష్ కుమారుడు వేదాన్స్ మూడు సంవత్సరాల బాబు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుండడంతో మణుగూరు సింగరేణి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం సింగరేణి వైద్యశాలకు రిఫర్ చేశారు.
విషయం తెలుసుకున్న మణుగూరు ఏరియా టిబిజికెవిస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు మంగళ వారం నాడు కొత్తగూడెం సింగరేణి వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్న చిన్నారి వేదాన్స్‌ను పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వేదాన్స్‌కు అవసరమైన మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను కోరారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని నాగెల్లి ఆకాంక్షించారు. కార్మిక కుటుంబాలకు ఎటువంటి వైద్యపరమైన ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబిజికెవిస్ నాయకులు మునిగేల నాగేశ్వరరావు, పి.కె. నాగరాజు, జి. శివ ప్రసన్నకుమార్, ఆపరేటర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సాగునీటితో పదవుల పందేరమా రైతు సమస్యలపై రాజకీయమా..?

- సాగు నీళ్ళిచ్చింది ఒక్క తుమ్మలచెరువు ఆయకట్టుకే..
- గత ప్రభుత్వం మంజూరు చేసిన 25 కోట్లే ఖర్చు.
- కొత్తగా ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టని ప్రభుత్వం..
- దీనికే ముప్పైసార్ల పర్యటనలు,మూడు ప్రారంభోత్సవ యత్నాలా..?
- మారెళ్ళపాడు రైట్ కెనాల్ పనులు ప్రారంభించాలి.
- మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.
- అధికార పార్టీ తీరుపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ధ్వజం.

మణుగూరు. సెప్టెంబర్ 29(డి డి 9వార్త)

సాగునీటి విషయంలో రైతుల సమస్యలను పరిష్కరించకుండా వరుస పర్యటనలు, ప్రారంభోత్సవాలతో అధికార పార్టీ సరికొత్త రాజకీయాలకు తెర తీస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ విమర్శించారు.
అశ్వాపురం లోని తెలంగాణా భవన్ లో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రెండుసార్లు మారెళ్ళపాడు మోటార్లను ప్రారంభించారని,
ఒకసారి శాసనసభ్యుల పర్యటనలో, మరోసారి రాష్ట్ర మంత్రులతో సమక్షంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు తుమ్మలచెరువు ఒక్కదానికే సాగునీరు అందిందని, ఇప్పుడు మరోసారి తుమ్మలచెరువు తూములు దింపి 15 అడుగుల మేర నీళ్లు నింపి మళ్ళీ ఒకసారి ప్రారంభానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.దంచికొడుతున్న ఎండలతో సాగునీరు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో తుమ్మలచెరువు తూములు దింపించాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు.
తూములు దింపాలని అధికారులకు వచ్చిన ఆదేశాలు అధినాయకులవా? లేక సహకార సంఘాల నామినేటెడ్ పదవుల కోసం వారి అనుయాయుల నుంచి వచ్చిన ఆదేశాలా? అని ప్రశ్నిస్తూ,అధికారులు ఎవరి ఆదేశాలను పాటిస్తున్నారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు."ఒక్క తుమ్మలచెరువు ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడానికి ముప్పైసార్లు పర్యటనలు, మూడు సార్లు ప్రారంభోత్సవాలా?" అని కోడి అమరేందర్ ప్రశ్నించారు.
ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వరుస పర్యటనలు,ప్రారంభోత్సవాలు కాకుండా మారెళ్లపాడు రైట్ కెనాల్ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఆ పనులు చేపట్టకుండా పర్యటనల మీద పర్యటనలు చేయడం వల్ల రైతులకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు .ఈ ప్రాంతానికి సాగునీరు ఎలా వచ్చిందో, సీతారామ ప్రాజెక్టు నిర్మాణం ఏ ప్రభుత్వ హయాంలో జరిగిందో, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి నిధులు ఎవరు మంజూరు చేశారో ఈ ప్రాంత రైతాంగానికి తెలుసని ఆయన అన్నారు.మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లపాటు పట్టించుకోకుండా పక్కన పెట్టిన ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల తరపున జరిగిన పోరాటాలు నిద్రలేపాయని ఆయన పేర్కొన్నారు.
మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభమైన నాటి నుంచే నిరంతరంగా కొనసాగించి ఉంటే, ప్రస్తుతం ఎదురవుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో వంటి ప్రభావాలు ఉన్నప్పటికీ అశ్వాపురం మండలంలోని మరింత విస్తృతమైన ఆయకట్టుకు గోదావరి జలాలు అందించే అవకాశం ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు.మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించిందని, ఆ తర్వాత ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ప్రస్తుత ప్రభుత్వం వరుస పర్యటనలతో ప్రజాధనాన్ని వృథా చేస్తోందని మర్రి మల్లారెడ్డి ఆరోపించారు.ఇప్పటికైనా పర్యటనలు, ప్రారంభోత్సవాలు పక్కన పెట్టి మారెళ్లపాడు రైట్ కెనాల్ పనులను వెంటనే ప్రారంభించాలని, అశ్వాపురం మండలంలోని చివరి ఎకరం వరకు సాగునీరు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న దృశ్యం

- **ప్రధాన ఎన్నికల కమిషనర్ ను తొలగించాలి**
- **ఓటర్ల జాబితాపై సమగ్ర విచారణ చేపట్టాలి**
- **సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 29 (డీ డీ 9 వార్త)

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో భద్రాచలంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారనే ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను లక్ష్యంగా చేసుకుని పేర్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై సమగ్రంగా విచారణ జరిపించాలని ఏజే రమేష్ డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై వస్తున్న ఆరోపణలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన స్వతంత్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో తొలగించిన పేర్లపై పూర్తిస్థాయి పరిశీలన



జరిపి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా పోరాడాలని ఏజే రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు, జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగా, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట్రామారావు, డి.సీతా లక్ష్మి, చర్ల సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు, భద్రాచలం పట్టణ నాయకులు కొలగాని రమేష్ , ఉస్తెల కనకశ్రీతో పాటు ఆటో కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఓటు హక్కు పరిరక్షణకు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హత సాధించిన అంగన్వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

- **దుమ్ముగూడెం ప్రాజెక్టులో 105 ఖాళీలు.. 279 మంది అర్హులు**

భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 29 (డీ డీ 9 వార్త)

దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 30న భద్రాచలంలోని మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ జెట్టి విజయకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు పరిధిలో మొత్తం 105 అంగన్వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉండగా, వాటికి 486 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 207 మంది అనర్హులుగా, 279 మంది అర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. అర్హత పొందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలకు సంబంధించిన కాల్ లెటర్లను ఇప్పటికే పంపించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 30న భద్రాచలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల అభ్యర్థులకు విడివిడిగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ తెలిపారు. దుమ్ముగూడెం మండలానికి చెందిన అభ్యర్థులకు మధ్యాహ్నం 12 గంటలకు, భద్రాచలం మండలానికి చెందిన అభ్యర్థులకు సాయంత్రం 4 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇంటర్వ్యూ కాల్ లెటర్ తో పాటు ఒక జత జిరాక్స్ కాపీలను తప్పని సరిగా తీసుకుని నిర్దేశిత సమయానికి ఇంటర్వ్యూకేంద్రానికి హాజరు కావాలని సీడీపీఓ విజయకుమారి కోరారు.



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ఫుడ్ కమిషన్ ఆగ్రహం

- **నాణ్యమైన భోజనం అందించడం లేదని విద్యార్థుల ఫిర్యాదు..**
- **మెనూ పాటించకపోవడంపై అసహనం**

డిడి9 వార్త గుడిహత్నూర్:

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు సీతాగొంది ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, సభ్యుడు ఒరగంటి ఆనంద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు.
మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని విద్యార్థులు కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంపై కమిషన్ చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నభోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుని తింటుండటంపై కమిషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.





ఘనంగా 'క్రియేటివ్ మైండ్స్ – బ్రైటర్ భారత్' పోటీలు..

- **సృజనాత్మకతకు విద్యార్థుల పదును.. వికసిత్ భారత్ నిర్మాణంపై అవగాహన..**
- **చిదెం పూర్ణిమ, మాతూరి రోషిణి, షేక్ అఫ్షా విజేతలు..**

సెప్టెంబర్ 29. డిడి9 వార్త వెంకటాపురం.

విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంపై అవగాహన కల్పించేందుకు వెంకటాపురంలోని విజన్ స్కూల్‌లో "వికషిత్ భారత్ అంశంపై డ్రాయింగ్, వ్యాసరచన, ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించారు. బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ సెక్రటరీ అట్లూరి రఘురాం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, సృజనాత్మక ఆలోచనలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థుల ఆలోచనలు, నైపుణ్యాలు, ఆవిష్కరణలే భవిష్యత్ భారత నిర్మాణానికి పునాదులని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, తమ ప్రతిభను ప్రదర్శించేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని అన్నారు.
విజన్ స్కూల్ యాజమాన్యం మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు సృజనాత్మకత, భావవ్యక్తీకరణ, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, దేశం పట్ల బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపింది.
"యువ ఆలోచనలు.. సృజనాత్మక అభివ్యక్తులు.. బలమైన భారతదేశం" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.





దొడ్డ సంతోష్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన పాయం.**

మణుగూరు. సెప్టెంబర్ 29(డి డి 9వార్త)

భద్రాద్రి జిల్లా,పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన దొడ్డ సంతోష్ రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దొడ్డ సంతోష్ రెడ్డి మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతోష్ రెడ్డి మరణం కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, గ్రామ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆప్తుడిని కోల్పోయిన కుటుంబానికి ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని, మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని, ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల విలీనమే టీజేఎంయూ ధ్యేయం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డీడీ9 వార్త):

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో నిర్వహించనున్న యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ హనుమంత్ ముదిరాజ్ మంగళవారం బోధన్ డిపోను సందర్శించారు. డిపోలోని కార్మికులను నేరుగా కలిసి రాబోయే ఎన్నికల్లో టీజేఎంయూకి చెందిన గదా గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు తమ యూనియన్ తోడ్పడుతుందని, కేవలం విలీనం లక్ష్యంగానే టీజేఎంయూ ఆవిర్భవించిందని ఆయన స్పష్టం చేశారు.కార్మికుల నుంచి ఒక్క రూపాయి కూడా చందా వసూలు చేయకుండా నిస్వార్థంగా సేవ చేస్తున్న ఏకైక యూనియన్ టీజేఎంయూ మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.వి.కే. రావు, శీనయ్య, డిపో అధ్యక్షుడు మహేష్, సెక్రటరీ జి.కె. ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ సహదేవ్, పండరి, వై.ఎమ్. బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





ఆడబిడ్డలకు ప్రభుత్వం కొండంత అండ

- **ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్ రెడ్డి**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డీడీ9 వార్త):


ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ తూము పద్మా శరత్ రెడ్డి, బోధన్ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంకుదాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్వయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసానివ్వడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఆర్డీఓ విజయ కుమారి, వైస్ చైర్మన్ మీర్ ఇలియాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి గంగాశంకర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

23 ఏళ్ల నాయకత్వానికి మరోసారి పట్టం..

- **ఫోటోగ్రాఫర్స్ సంఘం ఎన్నికల్లో గాదె లింగమూర్తి సత్తా..**
- **బంపర్ మెజారిటీతో మరోసారి అధ్యక్షుడిగా ఎన్నిక..**
- **9 మంది ప్యానల్ సభ్యులకూ అఖండ విజయం..**

సెప్టెంబర్ 29. డిడి9 వార్త వెంకటాపురం.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో గాదె లింగమూర్తి ఘన విజయం సాధించారు. హనుమకొండ-ములుగు రోడ్డులోని కేఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన ఎన్నికల్లో గత 23 సంవత్సరాలుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న గాదె లింగమూర్తి మరోసారి బంపర్ మెజారిటీతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
లింగమూర్తి నాయకత్వంలోని ప్యానల్‌కు సభ్యులు మరోసారి ఘన మద్దతు పలికారు. ఆయనతో పాటు 9 మంది ప్యానల్ అభ్యర్థులు అఖండ మెజారిటీతో విజయం సాధించడం సంఘంలో ఆయనకు ఉన్న మద్దతుకు నిదర్శనంగా నిలిచింది.
విజయం అనంతరం వాజేడు, వెంకటాపురం మండలాల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ ఫోటోగ్రాఫర్ వలస రమేష్ అధ్యక్షతన, ముఖ్య సలహాదారు రాగం సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా అధ్యక్షురాలు చంద్రకళ, ఉపాధ్యక్షుడు దారిశెట్టి నాగేశ్వరరావు తదితర ఫోటోగ్రాఫర్లతో కలిసి కేక్ కట్ చేసి విజయాన్ని సంబరంగా జరుపుకున్నారు. అనంతరం ఫోటోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకటాపురం మెయిన్ సెంటర్‌లో నినాదాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సంక్షేమం, హక్కులు, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గాదె లింగమూర్తి నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో చెన్నం రాజు, ఆనంద్, రంజిత్, కిషోర్, రవి, భాను తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



టీజేఎంయూ బోధన్ డిపో నూతన కమిటీ ఎన్నిక

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డీడీ9 వార్త):



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బోధన్ డిపో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికైంది. యూనియన్ జనరల్ సెక్రటరీ కె. హనుమంతు ముదిరాజ్ ఈ మేరకు డిపో కమిటీ సభ్యుల నియామక పత్రాన్ని బోధన్ డిపో మేనేజర్‌కు అందజేశారు. నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా టి.మహేష్, సెక్రటరీగా జి.కె. ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా కె.పి. సింగ్, చైర్మన్‌గా వై.ఎమ్.బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.సహదేవ్‌లను నియమించినట్లు తెలిపారు. అలాగే ట్రెజరర్‌గా మరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.సి.శేఖర్, చీఫ్ అడ్వైజర్‌గా ఎల్.పండరి, అసిస్టెంట్ సెక్రటరీగా ఆర్.సాయిలు, గ్యారేజ్ సెక్రటరీగా దేవేందర్, అసిస్టెంట్ గ్యారేజ్ సెక్రటరీగా శివయ్య, జాయింట్ సెక్రటరీగా జయకృష్ణ, అసిస్టెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.శ్రీనివాస్, అడ్వైజర్‌గా వసంత్ రావు, అసిస్టెంట్ డిపో సెక్రటరీగా వి.సాయిలు బాధ్యతలు స్వీకరించారు. ఈ నూతన కమిటీకి డిపో యాజమాన్యం తగిన సహకారం అందించాలని జనరల్ సెక్రటరీ కోరారు.



దివ్యాంగ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు పోటీలు

నిజామాబాద్ , సెప్టెంబర్ 29 (డిడి9 వార్త):

దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కమ్మర్ పల్లి మండల కేంద్రంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి ఆంధ్రయ్య హాజరై క్రీడా పోటీలను ప్రారంభించి విద్యార్థులను ప్రోత్సహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో సదాశివ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమ శిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం పి. సాయన్న, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు మధుశేఖర్, ఐఈఆర్పీ రాజన్న పాల్గొని విద్యార్థులకు అవసరమైన సహకారం అందించారు. సీఆర్పీలు అంజయ్య, రాజేష్, లలిత కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములయ్యారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథులు, ఇతర అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. దివ్యాంగ విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు.

ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా వర్ణం శ్రీధర్ నియామకం

కమ్మర్‌పల్లి, సెప్టెంబర్ 29 (డిడి9 వార్త):



భారతీయ జనతా పార్టీ ఇందూరు జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ గ్రామానికి చెందిన వర్ణం శ్రీధర్‌ను నియమించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని శ్రీధర్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఇందూరు జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్‌కు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డికి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డికి, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారికి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బొబ్బిలి వేణుగోపాల్‌కు, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల శీనన్నకు, మలకన్నగారి మోహన్‌రెడ్డికి, కమ్మర్‌పల్లి మండల అధ్యక్షులు రమేష్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



గుడిహత్నూర్‌లో బీజేపీకి షాక్.. కాంగ్రెస్‌లోకి పలువురు నేతలు


డిడి9 వార్త గుడిహత్నూర్:

మండలంలోని తోషం గ్రామంలో బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, రాచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హిందూ వాహిని మండల అధ్యక్షుడు చెలకల రాజుతో పాటు పలువురు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ జాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు బోరంచి శ్రీకాంత్ రెడ్డి, మల్లెపూల సత్యనారాయణ, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొర్ర గణపతికి అంగారక చతుర్థి పూజలు

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డిడి9 వార్త):

బోధన్ పట్టణ బైపాస్ రోడ్డులోని బొర్ర గణపతి మందిరంలో అంగారక చతుర్థి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు సమర్పించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సందడితో విలసిల్లాయి.



యోగాతో మానసిక ప్రశాంతత

- **యోగ.. ధ్యానం.. క్రమశిక్షణ — విద్యార్థుల సమగ్ర వికాసానికి బాట**
- **ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ బోధ్‌లో యోగ శిక్షణ**

ఆదిలాబాద్ జిల్లా: బోధ్ మండలం : సెప్టెంబర్ 29 (డిడి 9 వార్త న్యూస్):

బోధ్ లోని స్థానిక ఆరోగ్య పాఠశాల 3.0 కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ బోధ్‌లో విద్యార్థినులకు ప్రత్యేక యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగ శిక్షకురాలు మునిగెల యోగిత విద్యార్థినులకు వివిధ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగ ముద్రలపై శిక్షణ ఇచ్చారు.

యోగాభ్యాసం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని మునిగెల యోగిత తెలిపారు. చిన్న వయస్సు నుంచే యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని వివరించారు.

ధ్యానం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవచ్చని, ఒత్తిడిని నియంత్రించుకోవడంలో ధ్యానం దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థుల్లో సానుకూల ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించడంలో యోగా, ధ్యానం ఉపయోగకరమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జ్ఞాన ముద్ర, ప్రాణ ముద్ర, ధ్యాన ముద్రలను విద్యార్థినులకు పరిచయం చేసి, వాటి సాధన విధానాన్ని వివరించారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానాన్ని విద్యార్థినులతో ప్రత్యక్షంగా సాధన చేయించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ రాథోడ్ పలిత, ఉపాధ్యాయురాలు అంజలి,వనిత విద్యార్థినులు పాల్గొన్నారు.





పోషకాహార వారోత్సవాలు

- **బోధన్ ఐసిడిఎస్ సిడిపిఓ... పద్మ**

కోటగిరి సెప్టెంబరు 29
(డిడి9 వార్త) : నిజామాబాద్ జిల్లా

కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పోషక అభియాన్. పోషకాహార వారోత్సవాలలో భాగంగా ఏర్పాటుచేసిన సమావే సమావేశానికి ముఖ్యఅతిథిగా బోధన్ సిడిపిఓ పద్మ హాజరై గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పోషకాహార విలువల గురించి వారు తీసుకునే ఆహార నియమాలు పద్ధతుల గురించితెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ ,ఎంపీడీవో విష్ణు, నాయబ్ తహసిల్దార్ మధు, కోటగిరి ఐసిడిఎస్ సూపర్వైజర్ కొమురవ్వ, పోతంగల్ ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకట రమణమ్మ, రుద్రూర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ శృతి,ఎడపల్లి ఐసిడిఎస్ సూపర్వైజర్ సావిత్రి, ఏఎన్ఎంలు,అంగన్వాడీ టీచర్లు ఆయాలు ,తల్లులు, గర్భిణీ స్త్రీలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

DD9 వార్తలు అదిలాబాద్ జిల్లా

ఇచ్చోడ: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి 108 అంబులెన్స్‌లోనే ప్రసవం చేయాల్సి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీబాయికి మంగళవారం పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో ఆమె భర్త 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. ఇచ్చోడ 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ రాకేష్ అంబులెన్స్‌లోనే ప్రసవం చేశాడు. లక్ష్మీబాయి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు పైలెట్ నాగరాజు తెలిపారు.



అనంతరం వారిని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

సాలూర తహశీల్ కార్యాలయంలో ఆర్ఐకి ఘన సన్మానం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డిడి9 వార్త):

సాలూర మండల తహశీల్దార్ కార్యాలయంలో గత రెండేళ్లుగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా సేవలందిస్తున్న మెహర్ ఆనంద్ వర్ని మండలానికి బదిలీ అయ్యారు. ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన వర్ని మండల కార్యాలయానికి బదిలీపై వెళ్లనున్నారు. మంగళవారం తహశీల్దార్ అజ్మత్ నవాజ్, సీనియర్ అసిస్టెంట్ నజీరుద్దీన్, ఆర్ఐ శంకర్ తదితరులు మెహర్ ఆనంద్‌ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. రెండేళ్ల కాలంలో మండలంలో రెవెన్యూ సేవలను సమర్థవంతంగా అందించారని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. నూతన స్థానంలోనూ ఆయన మరిన్ని ఉన్నత సేవలందించాలని అధికారులు, సిబ్బంది ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కళావతి, రాహుల్, శంకర్, సంజీవ్, అజర్, ఫయాజ్, గంగామణి, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

- **డయాలసిస్ సేవలు మెరుగుపరచాలి.. ఆక్సిజన్ ప్లాంట్ సమస్యలు తీర్చాలి**
- **గంజాయి, మత్తు పదార్థాల కట్టడికి పోలీసు, ఎక్సైజ్ శాఖలకు కఠిన ఆదేశాలు**

బోధన్, నిజామాబాద్ జిల్లా ,
సెప్టెంబర్ 29(డిడి9 వార్త):

పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం సహించేది లేదని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించి, వైద్యాధికారులతో కలసి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలోని వార్డులు, వసతులు, మందుల లభ్యత, రోగులకు అందుతున్న సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్, అనస్థీషియా స్పెషలిస్ట్ వైద్యుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, అత్యవసర సమయాల్లో రోగులకు వైద్యులు అందుబాటులో ఉండేలా పక్కా ప్రణాళిక రూపకల్పన చేయాలని స్పష్టం చేశారు. ఆక్సిజన్, గ్యాస్ ప్లాంట్ల సాంకేతిక లోపాలను తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు. ఎముకల చికిత్సకు ఎంతో కీలకమైన 'సిఆర్మ్' యంత్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తెస్తామని, డయాలసిస్ సెంటర్‌లో రోగులకు వేచి ఉండే సమయం తగ్గించేలా సేవలను విస్తరించాలని సూచించారు. ప్రాంతంలో రోజురోజుకూ విస్తరిస్తున్న గంజాయి విక్రయాలు, మత్తు పదార్థాల వినియోగంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు ఉమ్మడి కార్యాచరణ ద్వారా గంజాయి రవాణా, విక్రయ దందాను తుదిముట్టించాలని తేల్చిచెప్పారు. యువత, చిన్నారుల భవిష్యత్తు నాశనం కాకుండా కాపాడాల్సిన పూర్తి బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. మార్కెట్లో దొరికే ఆహార పదార్థాల్లో కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని, ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ విజయ కుమారి, ఆసుపత్రి వైద్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న బోధ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 29: (డిడి 9 వార్త న్యూస్):

బోధ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ సోదరుడి కుమారుడు తుల వెంకట్రామిరెడ్డి రిటైర్డ్ టీచర్ స్వర్గస్తులవగా ఈరోజు వారి అంతక్రియలు వారి స్వగ్రామం సోనాలలో నిర్వహించారు. బోధ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి వారి భౌతికకాయానికి నివాళులర్పించారు.*

అనంతరం బీఆర్ఎస్ కార్యకర్త రడపాక శంకర్ గారి సోదరిమణి స్వర్గస్తులవగా వారి మృతదేహానికి బోధ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాళులర్పించి ఆర్థిక సహాయం అందజేశారు. వీరి వెంట మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



కరత్వాడలో గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం

ఆదిలాబాద్ జిల్లా: బోధ్ మండలం
సెప్టెంబర్ 29: (డిడి 9 వార్త న్యూస్):



ఈరోజు బోధ్ మండలం లోని కరత్వాడ గ్రామపంచాయతీ లో సర్పంచ్ దుర్వ విశ్వేశ్వర్ అధ్యక్షతన పాలక వర్గ సభ్యులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యల పై చర్చించి పలు అభివృద్ధి పనులను చేయడానికి తీర్మాణాలు చేయడం జరిగింది ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ ద్యాగాల గంగరాణి పంచాయతీ కార్యదర్శి సమ్రిన్ సుల్తానా వార్డు సభ్యులు దేశం భీమాలింగు సిడం భీంరావ్ దుర్వ అనసూయ తదితరులు పాల్గొన్నారు





వైకల్యం గెలుపునకు అడ్డంకి కాదు

- **-బధిరులకు ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తాం**
- **-అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ గుప్తా**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డిడి9 వార్త):

శారీరక లోపాన్ని జయించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న బధిరులకు ప్రభుత్వం, సమాజం తోడుగా నిలవాల్సిన అవసరం ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో డెఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బధిరులు తమలోని మేధోశక్తితో అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. పోటీ ప్రపంచంలో సాధారణ వ్యక్తులకు ఏమాత్రం తీసిపోకుండా వివిధ రంగాల్లో రాణించడం శ్లాఘనీయమన్నారు. ఆటంకాలను ఎదుర్కొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సమాజంలో ఆదర్శంగా నిలిచారని అభినందించారు. ఏ సమయంలోనైనా బధిరుల సంక్షేమం, అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో డెఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహేష్, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, నాయకులు జ్యోతి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎరాజ్ పల్లి దేవి ఉత్సవ కమిటీ ఏకగ్రీవం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డిడి9 వార్త):

బోధన్ మండలం ఎరాజ్ పల్లి మహాలక్ష్మి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాబోయే దేవీ నవ రాత్రులను ఘనంగా నిర్వహించేందుకు గాను మంగళవారం గ్రామంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పెద్దోళ్ల లక్ష్మణ్ రెడ్డిని గ్రామస్తులు ఐకమత్యంతో ఎన్నుకున్నారు. గత మూడేళ్ల కాలంలో దేవి ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసి, ఆలయ అభివృద్ధికి కృషి చేసిన మాజీ అధ్యక్షుడు సూర్య అనిల్‌ను ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సత్కరించి అభినందించారు. పాత కమిటీ సభ్యులు ఆలయానికి సంబంధించిన జమ ఖర్చుల వివరాల రిజిస్టర్లను నూతన బాధ్యులకు అందజేశారు. గ్రామ ప్రజలందరి సమన్వయంతో ఉత్సవాలను ఆధ్యాత్మిక శోభతో నిర్వహిస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నూతన, పాత సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా స్కూల్ కొరకు స్థల పరిశీలన

- **గుండారంలో 25 ఎకరాల స్థలాన్ని పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**
- **రెండో దశలో నియోజకవర్గానికి పాఠశాల మంజూరయ్యేలా కృషి**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డిడి9 వార్త):

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మంగళవారం గుండారం శివారులో పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో స్థలం అవసరమవుతుందని, అర్బన్ పరిధిలో అంత పెద్ద స్థలాన్ని కేటాయించడం కష్టతరంగా మారిందన్నారు. అందుకే నగర సమీపంలో ఉన్న గుండారంలో అనువైన స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. అంతే కాకుండా నగర పరిధిలోనూ ప్రత్యామ్నాయంగా మరో స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఆధునిక విద్యా వసతులను ఒకే చోట అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మొదటి దశలో జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు పాఠశాలలు మంజూరయ్యాయని, రెండో దశలో అర్బన్ నియోజకవర్గానికి కూడా కచ్చితంగా మంజూరయ్యేలా శాసనసభ వేదికగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ వినయ్ సాగర్, టీఎస్ఈడబ్ల్యూఐసీ ఈఈ రవీందర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి మరియు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మందర్నలో ఇందిరమ్మ ఇళ్ల
మంజూరు పత్రాల పంపిణీ

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డిడి9 వార్త):

సాలూర మండలం మందర్న గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలను అందజేశారు. బీజేపీ సాలూర మండల అధ్యక్షుడు రావుబా గంగాధర్, పంచాయతీ కార్యదర్శి శిల్ప, గ్రామ పెద్దలు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని, ఇంటి నిర్మాణానికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వం నిబంధనల ప్రకారం విడతలవారీగా చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా
ఎం. ఖలీం మియా

మెదక్ సెప్టెంబర్ 29 (డిడి9 వార్త)

పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎం. ఖలీం మియా ను నియమించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ సూఫీ జానీ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఖలీం మియా మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



పోతంగల్ మండలంలో ఆటో యూనియన్ సభ్యులకు ఘన సత్కారం

పోతంగల్ సెప్టెంబర్ 29 (డిడి9 వార్త): నిజామాబాద్ జిల్లా పోతంగల్

మండల కేంద్రంలో ఆటో యూనియన్ సభ్యులకు పబ్బ శేఖర్ ఆధ్వర్యంలో చిన్నపాటి సత్కార కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో ఆటో డ్రైవర్లు అందిస్తున్న సేవలను గుర్తించి, వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పబ్బ శేఖర్ ఆటో యూనియన్ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. నిరంతరం ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతూ, సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో డ్రైవర్ల శ్రమ అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆటో యూనియన్ ప్రతినిధులు, సభ్యులు మరియు పలువురు ముఖ్యులు పాల్గొన్నారు.





సోనాలలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

- **తక్షణమే స్పందించిన విద్యుత్ సిబ్బంది**

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 29: (డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు సోనాల మండలంలో ట్రాన్స్ఫార్మర్ పనిచేయకపోవడంతో సోనాలలో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది విషయాన్ని స్థానిక విద్యుత్ సిబ్బందికి తెలియజేసిన వెంటనే వచ్చి రెండు గంటల లోపు పునరుద్ధరించారు ఏ ఎల్ ఎం ప్రణీత్ నరసయ్య సంతోష్ రాజు విద్యుత్ సిబ్బంది వారు పునరుద్ధరించారు వీరికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు





రైల్వే స్టేషన్, కాలనీల్లో సురక్షిత తాగునీరు

- **నీటి నాణ్యత తనిఖీలను ముమ్మరం చేసిన దక్షిణ మధ్య రైల్వే**
- **531 నీటి నమూనాలు పరీక్షించగా సంతృప్తికర ఫలితాలు**
- **కలుషితం కాకుండా కఠిన పర్యవేక్షణకు జీఎం ఆదేశం**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డిడి9 వార్త):

ప్రయాణికులతో పాటు రైల్వే ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా దక్షిణ మధ్య రైల్వే నీటి నాణ్యత పర్యవేక్షణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ డివిజన్ పరిధిలోని నిజామాబాద్ రైల్వే స్టేషన్, అనుబంధ రైల్వే కాలనీల్లో తాగునీటి శుభ్రతపై ప్రత్యేక తనిఖీలు, నిర్వహణ చర్యలు చేపడుతోంది. భూగర్భ జల వనరులు, మున్సిపల్ సరఫరా, నీటి నిల్వ రిజర్వాయర్లు, క్లోరినేషన్ ప్రక్రియలు, పంపిణీ వ్యవస్థలను నిరంతరం పరిశీలిస్తున్నారు. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 28 వరకు నిజామాబాద్ పరిధిలో సేకరించిన 531 తాగునీటి నమూనాలను అవశేష క్లోరిన్ స్థాయిల కోసం పరీక్షించగా, ప్రతీ నమూనా ప్రమాణాల ప్రకారం అత్యంత సంతృప్తికరంగా ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే ఈ.కోలీ వంటి బ్యాక్టీరియా కలుషితాలను గుర్తించేందుకు చేపట్టిన 134 నమూనాల బ్యాక్టీరియాలాజికల్ పరీక్షల్లో ఏ ఒక్కటి కూడా అసురక్షితంగా తేలలేదని అధికారులు స్పష్టం చేశారు. ఇంజినీరింగ్, వైద్య విభాగాల అధికారులు సంయుక్తంగా గ్రౌండ్ లెవల్, హై లెవల్ రిజర్వాయర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. స్టేషన్లలో సరఫరా చేసే నీరు ఇండియన్ రైల్వేస్ మెడికల్ మాన్యువల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రయాణికులకు సురక్షితమైన, స్వచ్ఛమైన నీటిని అందించాలని స్పష్టం చేశారు.



హుమ్మాపూర్‌లో ఘనంగా 'భూభారతి'
గ్రామ సభ అవగాహన సదస్సు

పోతంగల్, సెప్టెంబర్ 29:(డిడి9 వార్త):

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల పరిధిలోని హుమ్మాపూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "భూభారతి భూముల రీసర్వే" కార్యక్రమంపై మంగళవారం గ్రామ సభ అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ల సహాయంతో గ్రామాల్లోని భూములను పక్కాగా రీసర్వే చేసే ప్రక్రియపై రైతులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. సదస్సులో భాగంగా అధికారులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ రీసర్వేను ప్రవేశపెట్టిందని తెలిపారు. డ్రోన్ సర్వే ద్వారా ప్రతి భూకమతం యొక్క సరిహద్దులు డిజిటల్ రూపంలో అత్యంత ఖచ్చితత్వంతో నమోదవుతాయని, దీనివల్ల భవిష్యత్తులో భూ తగాదాలు వచ్చే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. గ్రామాల్లోని రైతులందరూ అధికారులకు సహకరించి తమ భూముల వివరాలను సరిచూసుకోవాలని, ఈ డిజిటల్ సర్వే ద్వారా లభించే భూ హక్కుల పత్రాలు రైతులకు పూర్తి భద్రతను ఇస్తాయని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సదస్సులో స్థానిక నాయకులు, అధికారులు మరియు హుమ్మాపూర్ గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు



ఉపాధ్యాయుడికి సన్మానం

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 29:(డిడి 9 వార్త న్యూస్):

ఇచ్చోడ మండలానికి చెందిన ఉపాధ్యాయుడు అన్వర్ సోనాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య బోధనా అందిస్తున్నారు అదిలాబాద్ జిల్లా పి ఆర్ టి యు జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు వీరికి సోనాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పి ఆర్ టి యు అధ్యక్షుడు దేవర్ల సంతోష్.ప్రధానోపాధ్యాయులు దేశముక్ సచిన్ ఉపాధ్యాయులు వీరికి శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు



పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన 8 మంది పై కేసు.. ఎసై గంగరాజు

తూప్రాన్ సెప్టెంబర్ 29 (డిడీ9 వార్త) ప్రతినిధి


మెదక్ జిల్లా తూప్రాన్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఎనిమిది మందిపై కేసు నమోదుచేసినట్లు ఎసై గంగరాజు తెలిపారు తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో సోమవారం డయల్ 100కు కాల్ రావడంతో, సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి డయల్ 100 కాల్‌కు స్పందించే క్రమంలో
ఆ సమయంలో అక్కడే ఉన్నా జంగం నవీన్, తొంట సతీష్, తొంట అనిల్, గోలిపల్లి వెంకట్ రామ్ రెడ్డి , గోలిపల్లి రాజా రెడ్డి, తొంట గణేష్, జంగం కిరణ్, బుర్ర వంశీగౌడ్ అనే ఎనిమిది మంది వ్యక్తులు మద్యం సేవించిన స్థితిలో విధి నిర్వహణ లో ఉన్నా పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడుతూ, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినట్లు గుర్తించి
ఈ ఘటనపై తూప్రాన్ ఎసై గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, విధుల్లో ఉన్న సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన వారి పై చట్టపరంగా చర్యలకు దారితీస్తుందని ఆయన తెలిపారు.



ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి: పూడూరు సొసైటీ చైర్మన్ ఎన్ సుధాకర్ రెడ్డి

డీడీ9 వార్త,మేడ్చల్

ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని పూడూరు సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ అన్నారు. మంగళవారం మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న రైతు వ్యవసాయ సహకార సంఘం 49వ సర్వసభ్య సమావేశం సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్లు,సొసైటీ ఎండీ సాయి దత్త చైతన్య,ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ రవి శంకర్,సొసైటీ పరిధిలోని పలువురు రైతులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఎన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీ నుండి రుణాలు తీసుకున్న రైతులందరూ సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.తమ సొసైటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత తీర్మానం చేసిన వన్ టైం సెటిల్మెంట్ కు అవకాశం ఇవ్వగా రూ.2 కోట్ల వరకు రుణాలు వసూలు అయినట్లుగా తెలిపారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ వల్ల ఎరువుల కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం దీన్ని తీసేయాలని కోరారు.అలాగే రాష్ట్రంలోని రైతు సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో రైతు వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ శ్యామ్ లాల్,డైరెక్టర్లు స్వరూప,మలోత్ రవి,విఠల్ రెడ్డి,వీరేందర్ గౌడ్,చిన్న మల్లేష్,మామిండ్ల శ్రీశైలం,డి విజయ్ కుమార్,అర్జున్, బి.శ్రీనివాస్ గౌడ్,తునికి సత్తెమ్మ,రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులకు భరోసానివ్వాలి

- **మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత**
- **కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**
- **మహిళా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన కమిషనర్ పి.సాయి చైతన్య**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డీడీ9 వార్త):

మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదగా ప్రవర్తిస్తూ, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతూ బాధితులకు కొండంత భరోసానివ్వాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశించారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన సీపీ, స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం సిబ్బంది కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డులను, కేసు ఫైళ్లను, పెండింగ్ కేసుల పురోగతిని లోతుగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మహిళలు, బాలికలకు సంబంధించిన ఫిర్యాదుల పట్ల అత్యంత సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదుదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించి, వారి నుంచి సేకరించిన ఆధారాలతో నిర్ణీత వ్యవధిలో దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కేసుల విచారణలో ఎలాంటి అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బాధితులు ఎటువంటి భయాందోళనలు లేకుండా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించవచ్చని, మహిళల భద్రతకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అనంతరం సిబ్బంది విధులు, ఆరోగ్య భద్రతపై దిశానిర్దేశం చేస్తూ.. అధికారులు, సిబ్బంది 24 గంటలూ హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతీ ఆరు నెలలకోసారి సిబ్బంది విధిగా హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీలత, ఎస్సైలు ఎం.డి. రహమతుల్లా, పి. రాజేశ్వర్, పి. జాన్సన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.





రికార్డులు అసంపూర్తిగా ఉంటే చర్యలు తప్పవు

- **బస్తీ దావాఖానా, టీ-హబ్‌లను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రాజశ్రీ**
- **వ్యాధి నిర్ధారణ పరీక్షలు 100% పూర్తి చేయాలి**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డీడీ9 వార్త):

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, అసంపూర్తిగా ఉంటే ఉపేక్షించేది లేదని నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ హెచ్చరించారు. నిజామాబాద్ నగరంలోని మిర్చి కాంపౌండ్‌లో ఉన్న బస్తీ దావాఖానాతో పాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని పాలియేటివ్ కేర్ సెంటర్, తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌లను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్తీ దావాఖానాలో మందుల స్టాక్ రిజిస్టర్, ఔషధాల పంపిణీ రికార్డులు, ఎన్సీడీ స్క్రీనింగ్ వివరాలు, రోగుల హాజరు పట్టిక, రిఫరల్ సేవల రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షలను లక్ష్యం మేరకు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అత్యవసర మందుల కొరత రాకుండా నిరంతరం అందుబాటులో ఉంచాలని, వైద్యాధికారులు, సిబ్బంది రోగులతో ఓర్పుగా, మర్యాదగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. అనంతరం జీజీహెచ్ ప్రాంగణంలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌ను సందర్శించి రోగులకు అవసరమయ్యే నొప్పి నివారణ మందుల లభ్యతపై ఆరా తీశారు. డ్యూటీ రోస్టర్ ప్రకారమే నర్సింగ్ సిబ్బంది విధులకు సమయానికి హాజరుకావాలన్నారు. టీహబ్‌లో శాంపిళ్ల సేకరణ సంఖ్యను పెంచాలని, పరీక్షల రిపోర్టులను రోగులకు ఆలస్యం చేయకుండా వేగంగా అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో బస్తీ దావాఖానా వైద్య సిబ్బంది, పాలియేటివ్ కేర్ డాక్టర్ చైతన్య, టీహబ్ వైద్యురాలు డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.





రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలు

- **-కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటే.. అన్ని వర్గాలనూ విస్మరించాయి**
- **-నగరానికి చేరుకున్న కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర**
- **-అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ధ్వజం**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 29(డీడీ9 వార్త):

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం నిజామాబాద్ నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్ సభలో ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ సాక్షిగా రైతులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. రూ.2 లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ రైతు భరోసా, భూమిలేని కూలీలకు రూ.12 వేల సాయం, వరి క్వింటాలుకు రూ.500 బోనస్ అని చెప్పి రైతులను నిలువునా ముంచారన్నారు. రైతులతో పాటు మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఎల్ నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, తీరా సమయం దాటాక ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన పేరిట లక్షల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం అన్నదాతలను మాత్రం పట్టించుకోవడం లేదని, గతంలో బీఆర్ఎస్ వ్యవహరించినట్లే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుచుకుంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలకు తన వాటా నిధులు ఇస్తుంటే, తామే చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బోధన్ నుంచి జగిత్యాల వరకు 320 కిలోమీటర్ల మేర సైకిల్ ర్యాలీ చేపట్టిన కిసాన్ మోర్చా నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు హరీష్ రెడ్డి, సుగంధం హరీష్, పద్మారెడ్డి, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు రాము, మల్కాయి మహేందర్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రతినిధి స్వామి యాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వనిత, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జస్పాల్ సింగ్, యువమోర్చా రాష్ట్ర సహ కోశాధికారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ కౌన్సిలర్ల చొరవతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వైకుంఠధామం

- **ఆరేళ్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం.. రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు**

గజ్వేల్, డీడీ9 వార్త :

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంతో పునరావాసం పొందిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రజల చిరకాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వైకుంఠధామం, కబ్రస్థాన్ ఏర్పాటుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల సమస్యను కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రత్యేక చొరవతో పరిష్కరించేందుకు కృషి చేశారు. అధికారుల నిర్ణయంతో సర్వే నంబర్ 297లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. కాలనీ కౌన్సిలర్లు ఉపేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, నర్సింహారెడ్డిలు వైకుంఠధామం, కబ్రస్థాన్ కోసం స్థలం అవసరమున్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వందలాది నిర్వాసిత కుటుంబాలకు ఈ సదుపాయాలు అత్యవసరమని వివరించారు. స్పందించిన నర్సారెడ్డి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు.
దీంతో అధికారులు స్పందించి సర్వే నంబర్ 297లో మొత్తం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఈ నెల 28న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఇందులో ఒక ఎకరం వైకుంఠధామానికి, మరో ఎకరం కబ్రస్థాన్‌కు కేటాయించారు. దీంతో ఆరేళ్లుగా స్థలం కోసం ఎదురుచూస్తున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రజల సమస్యకు పరిష్కారం లభించింది.

కాలనీవాసుల హర్షం

వైకుంఠధామం, కబ్రస్థాన్ కోసం స్థలం కేటాయించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన కౌన్సిలర్లను అభినందించారు. నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇదే విధంగా నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉపేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, నర్సింహారెడ్డితో పాటు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



గుంతల గుప్పిట్లో ఏజెన్సీ రహదారులు..

అధికారుల నిర్లక్ష్యానికి అంతెప్పుడు?



మూడేళ్లుగా గుంతల నరకయాతన.. నిధులు మంజూరైనా కదలని పనులు!

- ఇసుక లారీలకు దారులున్నాయి.. ప్రజలకు గుంతలే గతి!
- హామీలతో కాలయాపన.. ప్రమాదాల అంచున ఏజెన్సీ ప్రజల ప్రయాణం!
- వెంకటాపురం–భద్రాచలం రహదారి దుస్థితిపై ప్రజాగ్రహం.. శాశ్వత పరిష్కారం కోసం డిమాండ్..

సెప్టెంబర్ 29 డిడి9 వార్త వెంకటాపురం.

వెంకటాపురం ఏజెన్సీ రహదారులపై ప్రయాణమంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. అడుగడుగునా భారీ గుంతలు.. వర్షపు నీటితో నిండిన రోడ్లు.. గుంతల్లో ఎక్కడ ప్రమాదం పొంచి ఉందో తెలియని దుస్థితి! ఒకవైపు నిరంతర ఇసుక లారీల రాకపోకలు.. మరోవైపు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్న సామాన్య ప్రజలు! ఇదీ వెంకటాపురం-భద్రాచలం ప్రధాన రహదారి దుస్థితి. మూడేళ్లుగా సమస్య కొనసాగుతున్నా పరిష్కారం ఎక్కడ? రెండేళ్లుగా నిధులు మంజూరయ్యాయని చెబుతున్నా పనులు ప్రారంభించేదెప్పుడు? అంటూ స్థానికులు అధికార యంత్రాంగాన్ని నిలదీస్తున్నారు.

మూడేళ్లుగా గుంతలే గతి..
ప్రజల గోడు పట్టదా?

వెంకటాపురం నుంచి భద్రాచలం వరకు పలు గ్రామాలను కలిపే ప్రధాన రహదారులు తీవ్రంగా దెబ్బతినడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాటి లోతు కనిపించని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకు నిత్యావసరమైన రహదారులే ప్రమాదకరంగా మారితే పాలనా యంత్రాంగం బాధ్యత ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక రవాణాకు అనుమతులు..
రహదారుల మరమ్మతులకు



మోక్షమెప్పుడు?

ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక లారీల రాకపోకలు కొనసాగుతున్న నేపథ్యంలో భారీ వాహనాల బరువు, రహదారులపై వాటి ప్రభావం, రవాణా నిబంధనల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అధిక బరువుతో వాహనాలు నడుపుతున్నాయనే ఆరోపణలపై తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు నిర్ధారణైతే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక రవాణా సాగుతున్నప్పుడు రహదారుల భద్రతను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? రహదారులు దెబ్బతింటే బాధ్యత ఎవరిది? ప్రజల ఇబ్బందులకు పరిష్కారం చూపేదెవరు? ఇవే ఇప్పుడు ఏజెన్సీ ప్రజలను వేధిస్తున్న ప్రశ్నలు.

ధర్నాలు చేశాం.. రాస్తారోకోలు నిర్వహించాం.. అయినా మారని రోడ్లు!

రహదారుల దుస్థితిపై వామపక్ష, ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో గతంలో పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయినా క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరసనలు జరిగినప్పుడు స్పందిస్తామని చెప్పి, ఆ తర్వాత మౌనం వహిస్తే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆందోళనలను హామీలకే పరిమితం చేయకుండా, పనులు ప్రారంభించి అభివృద్ధిని చేతల్లో చూపించాలని కోరుతున్నారు.

నిధులు మంజూరయ్యాయంటారు.. పనులు మాత్రం కనిపించవు!

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ రహదారులపై గుంతలు మాత్రం అలాగే ఉన్నాయని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిధులు నిజంగా మంజూరైతే వాటి వివరాలను ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదు? టెండర్లు పూర్తయ్యాయా? కాంట్రాక్టు ఎవరికిచ్చారు? పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పటిలోగా పూర్తి చేస్తారు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

నిధుల మంజూరు ప్రకటనలతోనే అభివృద్ధి పూర్తయినట్లు కాదు.. ప్రజలకు ఉపయోగపడే రహదారులు నిర్మించినప్పుడే అభివృద్ధికి అర్థం ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారులారా..
ఇప్పటికైనా మేల్కొనండి!

ములుగు జిల్లా రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వెంకటాపురం-భద్రాచలం రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదకర గుంతలను తక్షణమే పూడ్చి, వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా నాణ్యమైన శాశ్వత రహదారి నిర్మాణానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరుతున్నారు.

అదేవిధంగా భారీ వాహనాల లోడును తనిఖీ చేయడం, రవాణా నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏజెన్సీ ప్రజల డిమాండ్ ఒక్కటే..
హామీలు కాదు, పనులు కావాలి!

రహదారుల నిర్మాణానికి గడువు ప్రకటించి పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.

ప్రజల సహనానికి పరీక్ష ఎప్పటివరకు?

మూడేళ్లుగా రహదారుల దుస్థితి కొనసాగుతుంటే.. రెండేళ్లుగా నిధుల మంజూరు గురించి చెబుతున్నా పనులు ముందుకు సాగకపోతే.. సామాన్య ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? అత్యవసర సమయంలో రహదారులపై ప్రయాణించాల్సి వస్తే వారి భద్రతకు భరోసా ఎవరు ఇస్తారు? ఏజెన్సీ ప్రజలకు కావాల్సింది ప్రకటనలు కాదు.. ప్రయాణించేందుకు గుంతలు లేని రహదారులు! హామీలు కాదు.. క్షేత్రస్థాయిలో కనిపించే అభివృద్ధి! సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా స్పందించి వెంకటాపురం–భద్రాచలం రహదారి సమస్యకు కాలపరిమితితో కూడిన శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రజల ప్రాణభద్రతను ప్రాధాన్యంగా తీసుకుని తక్షణమే పనులు ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





అమూల్ మిల్క్ డైరీ అక్టోబర్ 4న శంకుస్థాపన..

- అమితాషా రాక
- మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు

తూప్రాన్ సెప్టెంబర్ 28 (డిడి9 వార్త) ప్రతినిధి

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి లో అక్టోబర్ 4వ తేదీన అమూల్ సంస్థ భూమి పూజకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నానట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు అమూల్ రాకతో మెదక్ జిల్లాలో ఉన్న పాడి పశువు రైతులకు ప్రయోజనంలాభం కలుగుతుంది, అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అయన అన్నారు మెదక్ జిల్లా ప్రజలకు రానున్నాయి.అని ఎంపీ అన్నారు మెదక్ జిల్లా కు అమూల్ మిల్క్ డైరీ రావడానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు కృషి ని జిల్లా బిజెపి నాయకులు అభినందించారు ఈ శంకుస్థాపన కార్యక్రమానికి సంబందించిన పరిస్థితులను మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు స్థానిక అర్డీఓ బావయ్య డిఎస్పీ నరేందర్ గౌడ్ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ జిల్లా నాయకులు రాంమోహన్ గౌడ్ జానకిరామ్ గౌడ్ యదగిరి గోవింద్ పోచయ్య తూప్రాన్ బిజెపి కౌన్సిలర్ లు స్వామి అశోక్ పరిశీలించారు.




బాధిత కుటుంబాలకు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి భరోస..

- మృతుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు..

చిన్న శంకరంపేట (డిడి9 వార్త) సెప్టెంబర్ 29

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, బాధితుల కష్టాల్లో భాగస్వామిగా ఉంటున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం చిన్న శంకరంపేట మండలంలో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. చందంపేట గ్రామానికి చెందిన విలేకరి తాటికొండ సుధాకర్ తండ్రి కృష్ణ ఇటీవల మృతి చెందారు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి, కృష్ణ మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.అనంతరం జంగారాయి గ్రామానికి చెందిన బొమ్మరబోయిన కృష్ణ కుమార్తె కీర్తన ప్రైవేట్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కీర్తన మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయనతో పాటు గ్రామ అధ్యక్షుడు గడ్డం సురేష్, మాజీ మార్కెట్ డైరెక్టర్ బందెల ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ చౌటకూరి శ్యామ్, యూత్ అధ్యక్షుడు దుర్గం మహేష్‌గౌడ్, సిద్ధ రాములు, బందెల బన్ని, కరోల అనిల్, దేవదాస్, ముత్యాలు, భూపాల్‌రెడ్డి, గడ్డం నందు, నరసింహులు, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీపతి, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బందెల సుధాకర్, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, రామాయపల్లి సర్పంచ్ రేణుక తిరుపతి, మాజీ సర్పంచ్ గుగులోత్ సుధాకర్, మాజీ ఎంపీటీసీ బాచుపల్లి యాదగిరి, మాజీ సర్పంచ్ తోట రమేష్, గజట్లపల్లి ఉపసర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.





This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.